రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:18 (మంగళవారం సాయంత్రం) సహర్ : 4:48 (బుధవారం ఉదయం)





సత్యసాయి పథకం కార్మికులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సత్యసాయి కార్మికులతో నేడు పవన్ భేటీ

నిన్న అసెంబ్లీలో ఎమ్మెల్యే చెప్పారు.. డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు!

రాజమహేంద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అసెంబ్లీలో సత్యసాయి వాటర్ స్కీమ్ కార్మికుల సమస్యలపై సోమవారం గళమెత్తారు. మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు. దీనిపై ఆ వెంటనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. సమస్య పరిష్కారం కోసం చర్చిద్దామని బుధవారం సాయంత్రం అమరావతికి రావాలని యూనియన్ నేతలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆహ్వానం పంపారు. ఇదిలా ఉండగా 48 నెలలుగా జీతాలి వ్వకపోవడంతో చేపట్టిన దీక్షను కలెక్టర్ కార్మికులతో చర్చించి మంగళవారం విరమింపజేశారు.సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నుంచి నీటిని పంప్ చేసి వివిధ గ్రామాల మంచినీటి అవసరాలు తీర్చడం కోసం సత్యసాయి ట్రస్ట్ పంపింగ్ స్కీమ్ నిర్మించిన సంగతి తెలిసిందే. చాలా కాలంగా ఇది కొనసాగుతోంది. సీతానగరం,గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని 74 హేబిటేషన్లకు ఈ పథకం ద్వారా మంచినీరు సరఫరా అయ్యేది. దీని కోసం 60 మంది వరకూ పనిచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ కలెక్టర్ పర్యవేక్షించేవారు. వైసీపీ ప్రభుత్వంలో దీనిని అసలు పట్టించుకోలేదు. ఇప్పటి వరకూ మొత్తం 48 నెలల జీతాలు పెండింగ్ ఉండడం గమనార్హం. గత ప్రభుత్వం జీతాలకే కాదు.. నిర్వహణకు సొమ్ములివ్వలేదు.దీంతో తాము జీతాల్లే కుండా పనిచేయలేమని చెబుతూ సోమవారం లాలాచెరువులోని ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ఎదుట కార్మికులు దీక్ష ఆరంభించారు.కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జోక్యం చేసుకుని వారితో చర్చించడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యూటీ సీఎం చర్చలకు ఆహ్వానించారు. ఈ సమావేశానికి కార్మిక నాయకులతో పాటు ఆర్‌డబ్ల్యు ఎస్ ఎస్ఈ గిరి వెళ్లనున్నారు.

కార్మికుల నెల జీతాలకు రూ.10 లక్షలు : కలెక్టర్

సత్యసాయివాటర్ స్కీమ్ కార్మికుల నెల జీతం కోసం రూ.10 లక్షలు ఇవ్వడానికి తాము చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె మంగళ వారం కార్మికులతో చర్చించారు. వేసవి దృష్ట్యా మంచినీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం రాకూడ దన్నారు.స్థానిక సంస్థల్లో స్కీమ్‌ను విలీనం చేయడం వల్ల నిధులు సాధ్యమవుతాయన్నారు. సత్య సాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ నేతలు కట్టమూరి వీరబాబు, ఉందుర్తి ఇస్సాక్ మాట్లాడుతూ తమకు వచ్చిన హామీ మేరకు దీక్ష విరమిస్తున్నామన్నారు.



నాడు వైసీపీలో నా ఫోన్ హ్యాక్ చేశారు!

అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అందరి ఫోన్లు హ్యాక్ చేశారని..ఆఖరికి నా ఫోన్ కూడా హ్యాక్ అయితే తాను ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి ఐ ఫోనుకు మారాల్సి వచ్చిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇటువంటి పనులతో వైసీపీప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు.కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు సేవలు చేరువ చేసి నీతివంతమైన పాలన చేస్తుందన్నారు. రాష్ట్రంలో వాట్సాప్ పరిపాలన వల్ల ప్రజలకు పారదర్శకమైన సేవలు మరింత చేరువవుతాయని ఐటీ అంటే గుర్తుకు వచ్చేది మన సీఎం చంద్రబాబేనని.. ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్ అంటే మంత్రి నారా లోకేష్ గుర్తుకువస్తున్నారన్నారు. ఐటీ నుంచి ఏఐకి మారడం గొప్పవిషయమని కొనియాడారు.వాట్సాప్ పరిపాలన వల్ల ఉపాధి కోల్పోతామని మీ సేవ నిర్వాహకుల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు.



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వైద్య వృత్తి.. నోబెల్ ప్రొఫెషన్

మెడికల్ కళాశాల తొలి వార్షికోత్సవంలో కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైద్యవృత్తి నోబెల్ ప్రొఫెషన్ అని.. వైద్య విద్యార్థులు వైద్య సేవల్లో నైపుణ్యం పెంచుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రథమ వార్షికోత్సవంలో మంగళవారం ఆమె మాట్లాడారు. వైద్య వృత్తి సేవాభావంతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని మెడికోలు తెలుసుకోవాలని సూచించారు. గతేడాది వైద్య విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించడం శుభపరిణామమన్నారు. వైద్య విద్యార్థులు కష్టపడి చదువుకుని, వైద్యులు అయిన తర్వాత అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలన్నారు.సౌభాగ్యమిత్ర లోగోను కలెక్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పరికరాలు

జిల్లాకు 1780 పరికరాలు - 26 వరకూ దరఖాస్తు గడువు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వ్యవసాయంలో చిన్న సన్న కారు రైతులకు తోడ్పాటు ఇవ్వడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం యంత్ర పరికరాలను మంజూరు చేసింది. జిల్లాలో 1780 మంది రైతులకు రూ. 3.92 కోట్లతో 1780 పరికరాలను ఇవ్వనుంది. ఈ పథకానికి ఐదెకరాల్లోపు ఉన్న చిన్న సన్న కారు రైతులు ఎవరైనా అర్హులే.ఒక కుటుంబంలో ఒక రైతుకు ఒక పరికరం ఇస్తారు. 50 శాతం సబ్సిడీ ఉంటుంది.రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకానిజం (ఎస్ఎంఏఎం)కింద పరికరాలు అందించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఐటీడీ) ద్వారా వీటిని అమలుచేయనున్నారు. పరికరాలకు గ్రామాల్లో ఉండే రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ (వీఏఏ)లను సంప్రదించాలి.ఆన్‌లైన్ ద్వారా ఏపీఎస్ఏఐడీసీ లిమిటెడ్‌కు దరఖాస్తు చేస్తారు. అర్హులను ఎంపిక చేస్తారు.

ఎవరు అర్హులంటే..

గత ఐదేళ్లలో వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పొందని వారు. ఎస్సీఎస్టీ రైతులు, మహిళలు, చిన్న, సన్నకారు రైతులు. ఈ- పంటలో నమోదు చేసుకున్న పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న వాస్తవ సాగుదారులే అర్హులు. ఏజెన్సీల్లో అయితే ఆర్‌వోఎఫ్ఆర్ భూములను సాగుచేస్తున్న రైతులు. కుటుంబానికి ఒక లబ్ధిదారుడే. ఒక పనిముట్టు మాత్రమే ఇస్తారు.

26వ తేదీ వరకే గడువు

వ్యవసాయ పనిముట్లకు రైతులు ఈనెల 26వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విలేజి అగ్రి కల్చరల్ అసిస్టెంట్‌ను సంప్రదించి, అతని ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ అవకాశాన్ని వినియోగించుకుని వచ్చే సీజన్ నుంచే యంత్రాలతో పనిచేసుకోవచ్చు.- మాధవరావు, డీఏవో

రైతులకు సబ్సిడీపై యంత్రాలిలా..

పరికరాలు	జనరల్	ఎస్సీ/ఎస్టీ
బ్యాటరీ స్ప్రేయర్లు	342	108
పవర్ స్ప్రేయర్లు	342	108
ట్రాక్టర్ పరికరాలు	525	165
రోటోవేటర్లు	19	6
పవర్ వీడర్లు	11	4
బ్రష్ కట్టర్లు	7	3
పవర్ టిల్లర్లు	107	33

జిల్లాలో మొత్తం 1780 మంది రైతులకు 17 80 పరికరాలు ఇవ్వనున్నారు. జనరల్ కేటగిరిలో రూ.2.99 కోట్లతో 1353 పరికరాలను 1353 మంది రైతులకు ఇవ్వనున్నారు. మిగిలిన 427 పరికరాలు ఎస్సీలకు 302, ఎస్టీలకు 125 ఇవ్వనున్నారు.

రాజమండ్రికి చెందిన ఓ కాంట్రాక్టరు ఫేస్ బుక్ చూస్తూ ఓ యాడ్‌పై క్లిక్ చేశాడు. ఇంకేముంది..తక్కువ సమయంలో కోట్లు సంపాదిం చవచ్చని కనబడింది. యాప్ డౌన్‌లోడ్ చేసు కున్నాడు. ముందు కొంత సొమ్ము పెట్టుబడి పెట్టాడు. రెట్టింపు వచ్చినట్టు యాప్‌లో చూపించింది. ఎప్పుడైతే యాప్‌లో తన వివరాలను నమోదు చేశాడో ఇతడి క్రెడిట్ కార్డుల నెంబర్లు, పిన్‌లతో సహా అవతలి వ్యక్తులకు వెళ్లిపోయాయి. మూడు రోజుల్లో అవి ఉపయోగించి రూ.50 లక్షలు దోచేశారు. యాప్ పని చేయడం ఆగిపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.


కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఓ యువకుడు ఈజీగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మాత్రమే ఆదాయ మార్గమని తన స్నేహితుడి ద్వారా తెలుసుకున్నాడు. వెంటనే యాప్‌లను డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మొదట రూ.20 నుంచి మొదలు పెట్టిన ఈ ఆటకు అంతే లేకుండా పోయింది.అప్పులు చేసి మరీ ఈ బెట్టింగ్ యాప్‌ల్లో ఆడాడు.. తీవ్రంగా నష్టపోయాడు. తనకున్న సొంతింటిని అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో రెవె న్యూ శాఖలో పనిచేస్తున్న ఒక మహిళా సిబ్బంది భర్త ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు.తన భార్య బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి మరీ బెట్టింగ్ కాసి ఉన్నదంతా పోగొట్టుకున్నాడు.ఏమీ చేయలేని నిస్సహాయతతో ఇంటికి వెళ్లే ధైర్యం లేక అజ్ఞాతంలోకి వెళ్లాడు.

కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన ఒక తాపీ మేస్త్రి బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పులు పాలయ్యాడు.. చివరికి భరించలేక ఇటీవల పేరుపాలెం బీచ్‌కు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు భార్యకు వీడియో పెట్టాడు. కంగారుపడిన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆచూకీ లభించలేదు. తరువాత అతను ఫోన్ చేసి బతికే ఉన్నానని.. బెట్టింగ్‌ల కారణంగా ఇలా చేశానని వాపోయాడు.

పరీమ్యాచ్, బెట్ 365, డ్రాఫ్ట్‌కింగ్స్, ఫాన్ డ్యూయల్, 1ఎక్స్‌బెట్, బెట్ఎంజీఎం, టాజ్777, టార్గెట్‌గేమ్స్.. ఇవన్నీ ఏంటో అనుకుంటున్నారా.. బెట్టింగ్‌ల యాప్‌ల పేర్లు.. 'వీటిలో జస్ట్ కొద్దిగా డబ్బులు పెట్టండి.. వెలకమ్ బోనస్ వస్తుంది..' అంటూ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో యాప్‌ల ప్రమోషన్లు చేసి యువతను టెంప్ట్ చేస్తారు.వీటి మాయలో పడిన యువత త్వరగా డబ్బు సంపాదించాలనే కోరికతో డబ్బులు పెట్టీ.. పెట్టీ.. పెట్టీ నష్టపోతున్నారు. అప్పులపాలవుతున్నారు.. చేసిన తప్పును ఎవరికీ చెప్పుకోలేక..ఆ నరకం నుంచి బయటపడలేక ఆత్మహత్య చేసుకోవడమో.. అదృశ్యం కావడమో చేస్తున్నారు.. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లు చేస్తున్న కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ యాప్‌ల బారినపడి నలిగిపోతున్న యువత పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ప్రాణాలతో.. సెల్‌గాటం!



యాప్‌ల...ట్రాప్‌లో జీవితాలు నాశనం

- బెట్టింగ్ యాప్‌లపై ఆసక్తి
- సోషల్‌మీడియాలో ప్రమోషన్లు
- ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో ప్రచారం
- వలలో పడుతున్న జనం
- ఈజీ మనీ కోసం వెంపర్లాట
- నష్టపోయినా..ఆగని వేట
- తీరని అత్యాశతో అప్పులు
- నిండా మునుగుతున్న వైనం
- ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్య
- గుట్టుగా బెట్టింగ్ వ్యాపారాలు
- తెలంగాణలో కేసులు నమోదు
- ఉమ్మడి జిల్లాల్లో పట్టని పోలీసులు

(రాజమహేంద్రవరం/కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చోరీ కేసులు, గంజాయి రవాణా వంటి నేరాల వెనుక ఆన్‌లైన్ బెట్టింగ్ బూచీ లింక్ అయి ఉంటోంది. నేరాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా యువత, నడి వయస్కులు ఉంటున్నారు. వీళ్ల నేరాల ద్వారా సంపాదించిన సొమ్మును బెట్టింగ్‌లకు వెచ్చిస్తున్నారు. లేదంటే బెట్టింగ్‌ల వల్ల అప్పులపాలై వాటిని తీర్చడానికి వక్రమార్గాన్ని అనుసరిస్తున్నారు. కొంత మంది ప్రాణాలు తీసుకుంటున్నారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కాసుల కక్కుర్తితో ఇస్తున్న ప్రకటనలు మరింత కీడు చేస్తున్నాయి.ఆస్తులు అమ్ముకొని బికారులుగా మిగిలినవాళ్లు, అప్పులు తీర్చడానికి దొంగలుగా మారినవారు ఎంతో మంది. బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీసిన ఘటనలెన్నో. ఇవేవీ బయటకు రావు..పోలీసు కేసుల్లో నమోదు కావు.



స్మార్ట్‌ఫోన్‌లోనే అన్నీ..

నేటి సాంకేతిక యుగంలో బెట్టింగ్ స్మార్ట్ ఫోన్‌లోకి వచ్చేయడంతో యువత ఆసక్తి చూపుతున్నారు. కలర్ ప్రిడిక్షన్, నెంబర్ ప్రిడిక్షన్.. క్రికెట్, కాసినో.. ఇలా అనేక రకాల విదేశీ యాప్‌లు అందుబాటులోకి రావడంతో ఈజీగా డబ్బులు సంపాదించొచ్చనే ఆశతో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.ఎక్కువగా ఉమ్మడి జిల్లాల్లోని గ్రామీణ యువత వీటి బారినపడి నలిగిపోతున్నారు.

విద్యార్థులు, ఉద్యోగులు..

బెట్టింగ్ యాప్‌ల వలలో స్టూడెంట్స్, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వాళ్లూ పడుతున్నారు. ముందు సరదాగా మొదలుపెట్టినా తర్వాత వ్యసనంగా మారిపోతోంది. బెట్టింగ్ యాప్‌ల వలలో ఎక్కువగా చదువుకున్న వారే ఉంటుండడం ఆందోళన కలిగిస్తోందని సర్వేలు చెబుతున్నాయి. ఏఐ సాంకేతికత, అల్గారిథమ్స్ వంటి అధునాతన టెక్నాలజీలతో యాప్‌లు తయారు చేస్తుండడంతో యాడ్‌ల రూపంలో ఎలాగైనా డబ్బు సంపాదించాలనే బలహీనతను అవి క్యాష్ చేసుకుంటున్నాయి. యాప్‌ల వలలో పడి నష్టపోతున్న వారు కోకొల్లలు.వీరిలో 99 శాతం మంది పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. మరో వైపు పోలీసులు పట్టించుకోవడంలేదు . బెట్టింగ్ యాప్‌లపై చైతన్యం తీసుకురాలేకపోతున్నారు. దాదాపు 90 శాతం మంది విద్యార్థులు, ఖాళీ సమయం దొరికేవాళ్లు బెట్టింగ్ యాప్‌లపై మొగ్గు చూపుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో క్రికెట్ బెట్టింగ్‌లకు ఏకంగా ఒక కార్యాలయమే తెరిచేశారంటే పోలీసుల నిఘా ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తూర్పు గోదావరిలో 2023లో నిడదవోలు, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేవలం రెండు క్రికెట్ బెట్టింగ్ కేసులు మాత్రమే నమోదు కాగా..2024లో ఒక్క కేసూ నమోదు కాలేదు. 2025లో రాజానగరంలో ఒక్క కేసు నమోదైంది. వాస్తవానికి బెట్టింగ్ యాప్‌ల గురించి యాడ్‌లు ఇచ్చినా..వాటిని ప్రమోట్ చేసినా పోలీసులు కేసులు పెట్టవచ్చు.కానీ ఆ దిశగా ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా లో ఒక్క ప్రయత్నమూ లేదు.

అక్కడ లీగల్..ఇక్కడ ఇల్లీగల్?

బెట్టింగ్ యాప్ నిర్వాహకులు అధికశాతం విదేశాల నుంచి ఆపరేట్ చేస్తుంటారు. నైజీరియా, కెన్యా, ఫిలిపైన్స్, మెక్సికో వంటి చాలా దేశాల్లో జూదం లీగల్.అంటే జూదాన్ని అక్కడి చట్టాలు అనుమతిస్తాయి. అంతెందుకు మన దేశంలో కేరళ వంటి కొన్ని రాష్ట్రాల్లో లాటరీ టికెట్లను బహిరంగంగా అమ్ముతుంటారు.ఇలా ఒక చోట చట్టబద్ధమైన పని, మరో చోట చట్ట ఉల్లంఘన కింద ఉంటోంది. అందువల్ల బెట్టింగ్ యాప్‌ల్లో సొమ్ము పోగొట్టుకుంటే తిరిగి చేతికి రావడం అసాధ్యం. పోలీసులు ఎంత శ్రమించినా 10 శాతం ఫలితాలు సాధించలేక పోవచ్చు. ఇక్కడ బెట్టింగ్ యాప్‌ల్లో దోచుకున్న సొమ్ము విదేశాల్లోని నేరగాళ్ల ఖాతాలకు చేరుతుంది. దాన్ని వెనక్కి రప్పించడం ఎంతో కష్టం.

నాడు వైసీపీ నేతల దందా..

ఐపీఎల్, టీ 20 వంటి ఇతర సీజన్ల సమయంలో క్రికెట్ బెట్టింగ్ యథేచ్ఛగా సాగుతోంది. కాకినాడ కేంద్రంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ బెట్టింగ్ భారీగా సాగింది. స్థానిక వైసీపీ నాయకుడి ముఖ్య అనుచరులే ఈ బెట్టింగ్ కార్యకలాపాలకు మధ్యవర్తులుగా ఉండి నిర్వహించేవారు. లక్షలాది రూపాయలు పందేలు కాసిన వారెందరో ఈ క్రికెట్ బెట్టింగ్ బారిన పడి అప్పులపాలైనట్టు తెలుస్తోంది. అప్పట్లో ఎవరూ దీనిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేని పరిస్థితి.ప్రత్యేకంగా బుకీలను ఏర్పాటు చేసుకుని మరీ గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారాన్ని నడిపిన కొందరు కోట్లు సంపాదిస్తున్నారు. ఈ తరహా ఇతర ప్రాంతాల్లో కూడా కొందరు వెనకుండి యాప్‌లను నిర్వహి స్తూ యువతను బెట్టింగ్ మాయలోకి దింపుతున్నారు.



మనోళ్లే..క్రికెట్ బుకీలుగా..

రాయవరం : ఈ నెల 3న జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇండియా-ఆస్ట్రేలియా లీగ్ మ్యాచ్‌పై రాయవరం మండలం సోమేశ్వరం, రాజానగరం మండలం చక్రద్వారబంధంలో ఆరుగురు క్రికె ట్ బుకీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.4 ల్యాప్‌టాప్‌లు,50 సెల్‌ఫోన్లు, రెండు ఎల్ఈడీ టీవీలు, రెండు లైన్‌బాక్స్‌లు,రూ.7.38 లక్షల నగదు కలిగిన బ్యాంక్ ఖాతా ఫ్రీజ్‌చేశారు.

రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం బ్రిడ్జి కౌంటీలోని బి-12 విల్లాలో దుబాయ్ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు పోలీసులు నిర్ధారించారు. కర్ణాటక,భీమవరానికి చెందిన 12 మందిని అరెస్టు చేశారు.ఈ ముఠాలో భీమవరానికి చెందిన వినీత్ దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి పలు రకాల పేర్లతో వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నట్టు తెలు సుకున్నారు. ఇటీవల ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తుండగా అరెస్టు చేశారు.

బల్లిపాడులో అర్ధరాత్రి ఇసుక డ్రెడ్జింగ్

తాళపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపులో మంగళవారం రాత్రి మైనింగ్, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు.ఈ దాడుల్లో డ్రెడ్జింగ్ పడవ,ఇసుకను అన్‌లోడ్ చేస్తున్న మిష న్,ఇసుక రవాణాకు వినియో గించే వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి, తాళ్లపూడి రెవెన్యూ సిబ్బంది మంగళవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేశారు. ఇసుక ర్యాంప్ నిర్వాహకులను ప్రశ్నించి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. డ్రెడ్జింగ్ బోటును సీజ్ చేసిన ప్రాంతం తాళ్లపూడి మండ లం వేగేశ్వరపు రం పరిధి అని తేలింద న్నారు.ఈ దాడిలో మైనింగ్ ఏడీతో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మైన్స్ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బిల్లు లేని ఇసుక లారీ సీజ్

కొవ్వూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బిల్లు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాచేస్తున్న లారీని సీజ్ చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్సు ఎస్ఐ ప్రసాద్ బృందం మంగళవారం కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుకర్యాంపులో తనిఖీలు చేపట్టారు. ఎటువంటి బిల్లు లేకుండా 12 మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా చేస్తున్న లారీని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కేసునమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మైన్స్ అధికారులకు తెలియజేస్తున్నట్టు తెలిపారు.



బల్లిపాడు ర్యాంపులో మైన్స్ అధికారులు.. స్వాధీనం చేసుకున్న మిషన్,డ్రెడ్జింగ్ బోటు



డయేరియా ఎందుకొచ్చింది?

ఇంకనూ అంతుబట్టని వైనం

గోపాలపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గోపాలపురం మండలాన్ని డయేరియా భయ పెడుతోంది.. అయినా ఎందుకు వచ్చిందనేది నేటికీ అంతుచిక్కలేదు. గత నాలుగు రోజులుగా మండలంలో సుమారు 30 మంది డయేరియా బారినపడ్డారు. ఒక పక్క సీఎం చంద్రబాబు నాయుడు గోపాల పురం మండ లంలో పరిస్థితిపై ఆరాతీశారు. ఇదిలా ఉండగా సోమవారం పి.ప్రశాంతి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వైద్య శిబిరాలను సందర్శించి సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఇంకో వైపు 10 వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో ఇంటింటా సర్వేలు చేస్తూ డయేరియా బాధితుల నుంచి మలము, తాగునీరు నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపిస్తున్నారు.ఉచిత క్యాంపుల ద్వారా 16వ తేదీన 13 నీటి నమూనాలు, ఒక మలము సేకరించి డీపీహెచ్ఎల్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు.సోమవారం రెం డు చోట్ల నీటి నమూనాలతో పాటు ము గ్గురు డయేరియా బా ధితుల నుంచి మలం సేకరించి కాకినాడ ల్యాబ్‌కు పంపించారు. మరో చోట నాలుగు నీటి నమూనాలను సేకరించి వైజాగ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించినట్టు ఇక్కడి అధికారులుచెబుతున్నారు. నమూనాలను ల్యాబ్‌లకు పంపించి రెండు రోజులు పూర్తవుతున్నా నేటికీ ఫలితం అంద లేదు. ఇదిలా ఉంటే ఈ వ్యాధి నిర్ధారణ కోసం వివిధ రకాల నమూనాలను జిల్లా యంత్రాంగం సేకరించింది.



రోగులకు ఏర్పాటు చేసిన జంబో జెట్ కూలర్లు

గోపాలపురం ఆసుపత్రిలో ఏడుగురు బాధితులు

గోపాలపురంలో డయేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితుల సంఖ్య 9కి చేరింది. మంగళవారం ఉదయం వారిలో ఆరుగురు ఇంటికి వెళ్లారు. మరో నాలుగు కేసులు నమోదయ్యాయి.దీంతో మంగళవారం డయేరియా బాధితుల సంఖ్య ఏడుకు చేరింది. ఎమ్మెల్యే మద్దిపాటి వెం కట్రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్నారు. సోమవారం ఎమ్మెల్యే మద్దిపాటి ఆసుపత్రికి వచ్చే సమయానికి డయేరియా బాధితులు ఉన్న వార్డులో ఉక్కబోత ఉండడంతో ఎమ్మెల్యే ప్రతి వార్డులోనూ జంబో కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆసుపత్రి వార్డుల్లో జంబో కూలర్లు ఏర్పాటు చేశారు.

సత్యసాయి నీటి సరఫరాలో నిర్లక్ష్యం?

మండలంలో గత నాలుగు రోజులుగా డయేరియా వ్యాప్తితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీల ద్వారా సరఫరా చేసిన రక్షిత మంచినీటిని ఈ ప్రాంత ప్రజలు కేవలం గృహావసరాలకు వినియోగిస్తుంటారు.శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీటినే తాగుతారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసింది.కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు గడిచినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ పథకం నిర్వహణపై దృష్టిసారించలేదు. సత్యసాయి జలాల సరఫరాలో నాణ్యతా లోపం వల్లనే డయేరియా ప్రబలందని ప్రజలంటున్నారు.



ప్లీజ్... ప్రాణం నిలపండి

- రోడ్డు ప్రమాదాల్లో మొదటి గంటే కీలకం
- క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్తే రూ.25వేలు బహుమతి
- ప్రమాదాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన 'గుడ్ సమరిటన్' పథకం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కళ్ల ముందు ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. కానీ వారిని కాపాడేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. క్షణాల్లో ఆసుపత్రిలో చేర్పించాలన్న ఆలోచన ఉన్నా భవిష్యత్‌లో కేసుల్లో ఇరుక్కోవలసి వస్తుందేమో, కోర్టుల చుట్టూ తిరగాలేమోనన్న అనుమానం.. భయం వెంటాడే పరిస్థితి. ఇలాంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం 'గుడ్ సమరిటన్' పథకం తీసుకువచ్చింది. క్షతగాత్రుల్ని తక్షణమే ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడేలా చేసిన వారికి రూ.5వేలు ప్రోత్సాహకం ప్రకటించి అమలు చేసింది. తాజాగా ఆ మొత్తాన్ని రూ.25వేలకు పెంచింది.

ఎక్కువ మందిని కాపాడితే లక్ష

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం అందక సకాలంలో ఆసుపత్రికి తరలించక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపు) ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిచే అవకాశాలెక్కువని వైద్యులు చెప్తున్నారు. ఇలా చేసిన వారికి పోలీసు కేసుల భయం లేకుండా గుడ్ సమరిటన్ చట్టం అండగా నిలుస్తుంది. ఎక్కువ మందిని కాపాడితే రూ.లక్ష అదనపు ప్రోత్సాహకం అందిస్తారు.

ప్రోత్సాహకం పొందాలంటే..

ప్రాణాపాయంలో ఉన్న వారికి ఆస్పత్రికి తరలించే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే.. పోలీసులు అధికారికంగా లేఖ ఇస్తారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలతో పాటు పోలీసు శాఖ, ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి తహసీల్దార్‌కు దరఖాస్తు చేయాలి. రవాణా, రెవెన్యూ పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్‌బీ అధికారులతో కూడిన కమిటీ గుర్తించి నగదు ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.



కేసుల భయం అవసరం లేదు

కె.శ్రీధర్, కాకినాడ జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తుల్ని ఆసుపత్రికి తరలిస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్న అపోహలు వద్దు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించినా, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా పోలీసుల నుంచి ఇబ్బందులు ఉండవు. రోడ్డు ప్రమాద కేసులకు సాక్షులుగా ఉండాల్సిన అవసరం లేదు. ఆస్పత్రిలో ఫోన్ నెంబర్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. అవసరాన్ని బట్టి పోలీసులే యూనిఫాం లేకుండా మీ ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకుంటారు తప్ప మీరు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాల్సిన అవసరం లేదు. క్షతగాత్రుల్ని సకాలంలో ఆస్పత్రికి తీసుకువస్తే ఒకరి ప్రాణమే కాదు వారి కుటుంబం రోడ్డున పడకుండా కాపాడినవారవుతారు. అలాంటి వారిని ప్రభుత్వం ప్రాణదాతగా గుర్తించి ప్రశంసాపత్రంతో పాటు ప్రోత్సాహక నగదు కూడా అందజేస్తుంది.



బాగుంటే నలుగురికి చెప్పండి

- లేకపోతే వంద మందికి చెప్పండి
- 'కోర్ట్' మూవీలో కీలక పాత్రధారి ప్రియదర్శి
- కాకినాడ వాసిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటా: నటి శ్రీదేవి
- కాకినాడలో చిత్ర బృందం సందడి





కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సినిమా బాగుంటే నలుగురికి చెప్పండి... లేకపోతే వంద మందికి చెప్పండని 'కోర్టు' మూవీలో కీలక పాత్రధారి ప్రియదర్శి అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్ర బృందం కాకినాడలో మంగళవారం సందడి చేసింది. నటీనటులు ప్రేక్షకులను అలరించారు. కీలక పాత్ర పోషించిన ప్రియదర్శి న్యాయవాదిగా తనదైన శైలిలో ఆకట్టుకున్నారు. అరుదైన పాత్ర తనకు రావడం అదృష్టమన్నారు. కథానాయిక చేసిన శ్రీదేవి కాకినాడ నగరవాసి కావడంతో చాలా మంది చూడ్డానికి వచ్చారు. కోర్టు చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం సినిమా ప్రదర్శితమవుతున్న ఆనంద్ సినీ కాంప్లెక్స్‌ను చిత్ర బృందం సందర్శించింది. వారికి లక్ష్మీ టాకీస్ ప్రొప్రయిటర్ శ్రీనుబాబు స్వాగతం పలికారు. చిత్ర దర్శకుడు రామ్‌జగదీష్ మాట్లాడుతూ కథా బలంతో ఉన్న సినిమాలకు తెలుగు ప్రేక్షకులు పట్టడం కడతారన్నారు. నటి శ్రీదేవి మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న తనకు ఈ సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కాకినాడ వాసిగా సినిమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తానన్నారు. డిస్ట్రిబ్యూటర్లు అయిన జగ్గంపేట వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేతలు కొత్త శివ, బూర్లు సాయి, నటులు హర్షరోషన్, రామ్‌జగదీష్ సాంకేతిక బృందం సభ్యులు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిత్ర బృందం వాకలపూడిలోని హీరోయిన్ శ్రీదేవి బంధువుల గృహానికి వెళ్లి సందడి చేశారు. హీరో, హీరోయిన్లతో శ్రీదేవి బంధువులు, చుట్టుపక్కల వారు సెల్ఫీలు తీసుకున్నారు.


అభిమానులతో సెల్ఫీ దిగుతున్న హీరో, హీరోయిన్ హర్షరోషన్, శ్రీదేవి

నేర పరిశోధనకు సాంకేతిక పరిజ్ఞానం జోడించాలి

- ఏలూరు రేంజ్ ఐజీ జీవీకే అశోక్‌కుమార్

అమలాపురం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలు మెరుగ్గా నిర్వహించాలంటే ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత జోడించాలని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీ) జీవీకే అశోక్‌కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని పరిశీలించి రికార్డులను అశోక్‌కుమార్ తనిఖీ చేశారు. అనంతరం జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, జిల్లా ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో, స్పెషల్ బ్రాంచి విభాగాల రికార్డులను పరిశీలించారు. పోలీసు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లా కంట్రోల్ రూము, సోషల్ మీడియా విభాగాన్ని స్వయంగా సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉంటేనే జిల్లా పోలీసులకు మంచి పేరు వస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేర పరిశోధనలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ ఎవీఆర్‌పీబీ ప్రసాద్, సీఐలు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఐజీ

నేడు 'ఆదిత్య'లో ఎండ్యురన్స్

- హాజరుకానున్న డాక్టర్ గంగారెడ్డి (బెంగళూరు)


ప్రో కార్టింగ్ ఎండురన్స్‌కి టెస్టులు నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో బుధవారం ఎండురన్స్ పోటీలు జరగనున్నాయి. వర్సిటీలో ఈనెల 17న ప్రారంభమైన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ ఛాంపియన్‌షిప్ 2025 సీజన్- 5 పోటీల్లో భాగంగా రెండోరోజు పలు టెక్నిక్ అంశాల్లో టెక్నికల్ టీమ్ పరిశీలించింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన టీమ్‌లు మండుటెండను సైతం లెక్కచేయకుండా తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రయిల్‌రన్ నిర్వహిస్తూ టీమ్ సభ్యులు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని ... ఉత్కంఠను నింపారు. బ్రేకింగ్ టెస్ట్, యాక్సిల్ రేషన్, స్కిడ్‌పాడ్, ఆటోక్రోస్ టెస్ట్, తదితర డైనమిక్ ఈవెంట్స్ జరిగాయి. బుధవారం మధ్యాహ్నం రెండుగంటల నుంచి 3.30 గంటల వరకు ఎండురన్స్ జరగనున్నాయి.

ఉత్కంఠగా సాగే ఈ పోటీకి ముఖ్యఅతిథిగా డాక్టర్ గంగారెడ్డి (అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ అడ్వాన్స్డ్ ఇంజనీరింగ్ (గ్రూప్ బెంగళూరు) నుంచి వస్తున్నారని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు.

కాకినాడ తీరంలో సైనిక విన్యాసాలు

- వచ్చేనెల 8 నుంచి నిర్వహణ
- భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా..
- కాకినాడ జిల్లా డీఆర్వో వెంకట్రావు వెల్లడి


సైనిక అధికారులతో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ తీరంలోని నేవల్ ఎన్‌క్లేవ్‌లో వచ్చేనెల 8వ తేదీ నుంచి 13 వరకు భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా టైగర్ ట్రేయంఫ్-25 సైనికవిన్యాసాలు జరగనున్నాయి. దీనికోసం అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు. నిర్వహణపై కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం సైనిక, సివిల్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 7వ తేదీ నాటికి విన్యాసాలు జరిగే క్యాంపింగ్ సైట్‌లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలన్నారు. అలాగే వారం రోజుల పాటు పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాలను సిద్ధంచేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను సూచించారు. అగ్నిమాపకశాఖ నీటితో నింపిన రెండు ఫైర్ ఇంజన్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విన్యాసాలు జరిగే ప్రాంతంలో స్టేట్ హైట్ బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్‌మళ్లింపు, కోడ్ నియంత్రణ అంశాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. అలాగే సైనిక అధికారులు, సిబ్బంది, సామాగ్రిని విశాఖపట్నం - కాకినాడ మధ్యసంచరించే రూట్లలో రోడ్ కాన్వాయ్ ఆపరేషన్స్‌కు అవసరమైన సహకారాన్ని సైనిక అధికారులకు అందించాలన్నారు. మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్యశాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రేయంఫ్‌ను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో సహకరించాలన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. సమావేశంలో సివిల్, మిలిటరీ లైజాన్ అధికారి కమాండర్ కిషోర్, సైనిక అధికారి టీవీవీ ప్రసాద్, మెరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఎంహెచ్‌వో పృథ్వీ, మత్స్యశాఖ అధికారి అనురాధ , తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అటవీ అకాడమీ సొంత భవన నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

దివాన్‌చెరువు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీకి సొంత భవనం నిర్మాణానికి మార్గం సుగమమైంది. డిప్యూటీ సీఎం పవన్ చొరవతో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ రాష్ట్ర అటవీశాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఈమేరకు తాజాగా ఆదేశాలిచ్చారు. ఇక్కడ నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గత ఆగస్టులో పవన్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే దీన్ని కొనసాగించడంతో పాటు అక్కడే సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. దాంతో పవన్ ఈ విషయాన్ని కేంద్ర అటవీశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఎట్టకేలకు స్పందించిన కేంద్రం చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రాష్ట్ర అటవీ అకాడమీని దాదాపు ఎనిమిదేళ్లుగా రాష్ట్ర అటవీ పరిశోధనా భవనంలోనే నిర్వహిస్తున్నారు.

ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ ప్రదర్శన

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ నోటిఫికేషన్ ప్రకారం భర్తీ చేయనున్న 3 ఫార్మాసిస్ట్, ఒక డీఈవో, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ - 4 పోస్టులకు అభ్యర్థుల ప్రొవిజినల్ లిస్టును ఎన్ఐసీలో ప్రదర్శించినట్టు కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు గ్రీవెన్స్‌లో ఇవ్వాలన్నారు. అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితాను ఈ దిగువ ఎన్ఐసీల్లో పరిశీలించుకోవాలని కోరారు. హెచ్‌టీటీపీ//ఈస్టగోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, హెచ్‌టీటీపీ//కాకినాడ.ఏపీ.జీవోవీ.ఇన్, హెచ్‌టీటీపీ//కోనసీమ.ఏపీ.జీవోవీ.ఇన్. సందర్శించవచ్చు.

సినిమా థియేటర్ సీజ్

- అధిక ధరకు టికెట్ల విక్రయం
- రెవెన్యూ అధికారుల మెరుపుదాడి
- అమలాపురంలో శ్రీవెంకటరమణ సినిమా హాలులో ప్రదర్శన నిలిపివేత


థియేటర్ వద్ద మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా టికెట్ ధరలను పెంచి సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్‌పై రెవెన్యూ అధికారులు మెరుపుదాడి చేసి సీజ్ చేశారు. అమలాపురం పట్టణంలోని శ్రీ వెంకటరమణ థియేటర్‌లో కోర్టు సినిమా ప్రదర్శన టికెట్ ధర రూ.110కి విక్రయించాల్సి ఉండగా .. రూ.150 పెంచుతూ అమ్ముతున్నారని ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మంగళవారం థియేటర్‌పై ఆకస్మిక దాడి చేశారు. ముందుగా అధిక ధరలు చెల్లించి టికెట్ కొనుగోలు చేసినవారు యాజమాన్యం తీరుపై విచారణ చేపట్టారు. గత మూడు రోజుల నుంచి టికెట్ ధరలను నిబంధనలకు విరుద్ధంగా పెంచి విక్రయిస్తుండడాన్ని తనిఖీల్లో గుర్తించామని ఆర్డీవో మాధవి మీడియాకు వెల్లడించారు. దీనికి తోడు ఫామ్-బీ లైసెన్సు కూడా రెన్యువల్ చేయనట్టు రికార్డుల తనిఖీలో వెల్లడైందన్నారు. తక్షణమే థియేటర్‌లో తదుపరి షోను నిలిపివేసి రికార్డులను స్వాధీనం చేసుకుని జేసీకి నివేదించారు. విచారణ పూర్తయ్యే వరకు షోలు నిలిపివేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అమలాపురం డివిజన్‌లో చాలా థియేటర్లలో ఫామ్-బి లైసెన్సులు రెన్యువల్ చేయకుండానే షోలు ప్రదర్శిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నిబంధనలను ఎవరూ దాటొద్దన్నారు.

రాజమహేంద్రవరంలో కోర్ట్ సినిమా యూనిట్ సందడి


స్వామి థియేటర్‌లో సందడి చేస్తున్న చిత్ర బృందం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని స్వామి థియేటర్‌లో మంగళవారం కోర్ట్ సినిమా యూనిట్ సందడి చేసింది. చిత్రంలో పులికొండ లాయర్ పాత్ర పోషించిన ప్రియదర్శి, హీరో హర్షరోషన్, హీరోయిన్లు శ్రీదేవి, రిషిక, రైటర్ కమ్ డైరెక్టర్ రామ్‌జగదీష్, మ్యూజిక్ డైరెక్టర్ , తదితరులు పాల్గొని ప్రేక్షకులతో జోష్ కలిపారు. ఈ సినిమా మా అందర్నీ గెలిపించిందన్నారు. మంచి చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని మరోసారి ప్రేక్షకులు నిరూపించారన్నారు. నాని సహ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా ఎంతో అద్భుతంగా తెరకెక్కిందన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ ఈ చిత్రం రూపుదిద్దుకుందన్నారు. విడుదలైన మూడురోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.25 కోట్ల మేరకు కలెక్షన్స్ రావడం చిత్ర విజయానికి నిదర్శనమన్నారు. థియేటర్ యజమాని పులవర్తి లక్ష్మణస్వామి, జీబీఆర్ ఫిలిమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్యలేవి?

- వైసీపీ పాలనలో నిధుల దుర్వినియోగం
- రంప ఐటీడీఏలో ఆరోగ్య కేంద్రాలకు రూ.62 లక్షలతో స్కానింగ్ యంత్రాల కొనుగోళ్లు
- గిరిజనులకు ఉపయోగం లేని పార్కు నిర్మాణం కోసం రూ.20 లక్షలు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో రంపచోడవరం ఐటీడీఏ ఉన్నతాధికారులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. అప్పటి ప్రభుత్వ అధినేత మన్ననల కోసం ప్రాకులాడి, నిబంధనలకు తిలో దకాలిచ్చారు. ఫలితంగా గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం వెచ్చించాల్సిన నిధులను ఐటీడీఏ పాలక మండలి ఆమోదాలు లేకుండానే చట్ట విరుద్ధ అంశాలకు సైతం వెచ్చించారు. స్కానింగ్ యంత్రాలను వినియోగించేందుకు చట్టపరమైన ఎటువంటి అనుమతులు, వాటి నిర్వహణకు అనుభవజ్ఞులైన నిర్వహకులు లేకున్నా వాటిని కొనుగోలు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా ప్రభుత్వ ఖజానాకూ నష్టం చేకూర్చిన అధికారి ఒక రైతే, రూ.20 లక్షల ఉపాధి నిధులను నిరుపయోగమైన పార్కు నిర్మాణానికి వెచ్చించిన వారు మరొకరు. కొనుగోలు చేసిన యంత్రాలను వినియోగించే అవకాశమే లేక నేడు నిరుపయోగంగా ఉన్నాయి.



ఓ పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న స్కానింగ్ యంత్రం

ఎవరైనా స్కానింగ్ యంత్రాలను నిర్వహించాలనుకుంటే అది ఆసుపత్రి అయినా, లేక స్కానింగ్ సెంటరైనా చట్టప్రకారం అనుమతులుండాలి. కానీ రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు అటువంటి అను మతులు ఉన్న దాఖలాలు లేవు. చట్ట విరుద్ధం గానైనా ఆయా స్కానింగ్ యంత్రాలను నిర్వహించే అనుభవము, అనుమతీ ఉన్న వైద్యులు, సాంకేతిక సిబ్బంది లేకుండానే వాడ పల్లి, జడ్డంగి, బోదులూరు, ఇందుకూరుపేట, దుప్పుల పాలెం, నరసాపురం, పెదగెద్దాడ, చవటిదిబ్బలు, దేవీపట్నం, కొండమొదలు ఆరోగ్య కేంద్రాలకు రూ.62.69 లక్షలతో ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలను 2022, ఫిబ్రవరిలో కొనుగోలు చేశారు. రూ.37 లక్షలతో పీహెచ్‌సీల అంబులెన్సులు, 108 అంబులెన్సుల కోసం వైర్లెస్ డిజిటల్ రిపీటర్లు, డిజిటల్ బేస్ స్టేషన్లు, మొబైల్ సెట్లను కొనుగోలు చేశారు. రెండో విడత కొవిడ్ పేరుతో రూ.59.21 లక్షలతో అంబు బ్యాగ్‌లు, పల్స్ ఆక్సీ మీటర్లను, రూ.12.10 లక్షలతో 64 లీటర్ల సామర్థ్యం గల 15 ఆక్సిజన్ సిలెండర్లను మే, 2021లో కొనుగోలు చేశారు.

మరో అధికారి కూడా రంపచోడవరంలో ఒక పార్కు నిర్మాణకికి రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులను దుర్వినియోగపర్చారు. ఉపాధి హామీపై జరిగిన ఆడిట్‌లో ఇది తప్పుగా అనిపించలేదు. ఈ ఇద్దరి అధికారుల నిర్ణయాలు వివాదస్పదంగానే రంపచోడ వరం ఐటీడీఏలో సాగాయి. పాలకమండలి ఆమోదం లేకుండానే గిరిజన నిధులను దుర్విని యోగపర్చినా వారిపై ఏ చర్యలూ లేవు. ప్రభుత్వం మారి 9 నెలలు గడిచినా నిధుల దుర్వినియోగ నిర్ణయాలపై చర్యలు లేకపోవడంపై సర్వత్రా గిరిజన వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పూతరేకుల్లో కల్తీనెయ్యి

- ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ
- కల్తీ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్

ఆత్రేయపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పేరు చెప్పగానే పూతరేకులు అని గుర్తుకువస్తుంది. ఇక్కడ తయారుచేస్తున్న పూతరేకులకు ఎంతో పేరు ఉంది. సుమారు ఐదు దశాబ్దాల నుంచి ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో సుమారు 400 కుటుంబాలు పైనే కుటీర పరిశ్రమలుగా పెట్టుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. మహిళలు తయారు చేస్తున్న ఈ పూతరేకుల వ్యాపారంతో గ్రామరూపురేఖలే మారిపోయాయి. ఈ వ్యాపారం దిన దిన అభివృద్ధి చెందుతూ దేశనలుమూలలతో పాటు ఖంతరాలు దాటిపోయింది. ఇళ్లల్లో జరిగే ఫంక్షన్లకు ఈ స్వీటును రుచి చూపిస్తారు. ఇంత పేరుప్రఖ్యాతలు ఉన్న ఈ పూతరేకుల్లో వాడే నెయ్యి విషయంలో కొంతమంది అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నారు. కల్తీనెయ్యిని వాడుతూ స్వీటు ప్రియుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీనెయ్యి అమ్ముతున్న వ్యాపారస్తులకు అధిక ఆదాయం రావడంతో దీన్నే జోరుగా విక్రయిస్తున్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతిరోజు వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులు ఈ స్వీట్లను కొనుగోలుచేసుకుని బంధుమిత్రులకు రుచిచూపిస్తుంటారు. ఈ క్రమంలో గత కొంతకాలం నుంచి కొంతమంది వ్యాపారులు కల్తీనెయ్యి విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు

పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారనే వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఫుడ్‌సేఫ్టీ అధికారుల బృందం ఫిబ్రవరి 17న కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో పూతరేకుల తయారీ షాపులు, కల్తీనెయ్యి అమ్మకాలు సాగిస్తున్న షాపులపై ముమ్మరదాడులు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 160 కిలోల నెయ్యిని కల్తీ నెయ్యిగా అనుమానించి సీజ్ చేసి నమునాలను సేకరించారు. అలాగే వివిధ దుకాణాల్లో 8 సాంపిల్స్‌ను సేకరించి సీల్డ్ కవర్లలో భద్రపరిచారు. ఈ నెయ్యి సాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌లకు పంపించారు. అక్కడ ఈ నెయ్యిలో కల్తీ జరిగినట్టు గుర్తించారు. ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్ ల్యాబ్ రిపోర్టులో కల్తీ నెయ్యి వాడుతున్నట్టు నిర్ధారించినట్టుగా గుర్తించారు. కల్తీనెయ్యి అమ్ముతున్న, కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్న షాపు యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని తద్వారా వారిపై క్రిమినల్ కేసులు పెడతామని వివరించారు. వ్యాపారులు పూతరేకుల్లో విచ్చలవిడిగా కల్తీనెయ్యి వాడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. త్వరలోనే కల్తీనెయ్యి అమ్మకం తయారీషాపులపై దాడులు నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన నెయ్యి(బ్రాండ్) వాడాలని లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్య లు తప్పవని స్పష్టం చేశారు.



కల్తీనెయ్యి ప్యాకెట్లు





ఆత్రేయపురంలో నిర్వహించిన దాడుల్లో నెయ్యిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు(ఫైల్)

దెబ్బతిన్న పూతరేకుల ప్రతిష్ట

ఎన్నో ఏళ్ల నుంచి మహిళలు పూతరేకులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి దగ్గర తయారుచేస్తున్న నెయ్యి, బ్రాండెడ్ నెయ్యిని వాడుతూ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా నిలతొక్కుకుంటున్నారు. కొంతమంది వ్యాపారులు కల్తీనెయ్యితో పూతరేకులను తయారుచేయడంతో ఆత్రేయపురం పూతరేకుల ప్రతిష్ట దెబ్బతింది. దీంతో కొంతమంది వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

వెంటూరులో కారుణ్య అంత్యక్రియలు పూర్తి

రాయవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తండ్రి కర్కశానికి బలైన చిన్నారి పిల్లి కారుణ్య(7)కి మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరులో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈనెల 17న వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు తన కుమార్తె కారణ్యను, కుమారుడు రామ్‌సందీప్‌ను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువస్తూ రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు సమీపంలో గజపతినగరం వద్ద కాలువలో తోసేసిన ఘటన పాఠకులకు విదితమే. ఈ సంఘటనలో కారుణ్య కాలువలో కొట్టుకుపోయి మృతి చెందగా మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటూరులో రోదనల మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన క్రమంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్థిక సమస్యలే కారణమా?

వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు వ్యాపారలావాదేవిల నేపథ్యంలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజు తన పిల్లల్ని చంపి తాను చనిపోవాలని నిర్ణయించుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. పిల్లల్ని తోసేసిన తరువాత రాజు మాత్రం అక్కడి నుంచి తన మోటారు వాహనంపై పరారు కాగా, రెండో రోజు రాజు ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు సాంకేతికత ఆధారంగా రాజు ఆచూకీని కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజు బతికి ఉన్నాడా లేక తాను చనిపోవాలని నిర్ణయించుకుని ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే మిస్టరీ వీడడం లేదు.

రాజు కోసం పోలీసుల గాలింపు



పిల్లి రాజు

ద్రాక్షారామ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కన్న పిల్లలను కాలువలోకి తోసి కుమార్తె మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజు ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కారుణ్య మృతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. అప్పుల బాధ తాళలేక ఈ ఘోరానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. ప్రాణాలతో బయటపడిన కుమారుడు సందీప్ ఘటన పూర్వాపరాలు వెల్లడించారు. పిల్లి రాజు(40) తన పిల్లలను కాలువలోకి తోసి ఏపీ39హెచ్‌కె 1660 నెంబరు గల సుజుకి యాక్సెస్ మెరూన్ కలర్ మోటార్ సైకిల్‌పై పారిపోయాడు. రాజు తెలుపు రంగు షర్టు, నలుపు/నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతడి ఆచూకీ తెలిస్తే రామచంద్రపురం డీఎస్పీ 9440796507, సీఐ 34407965 36, ఎస్ఐ 9440904850లో సమాచారం ఇవ్వాలని దర్యాప్తు అధికారి సీఐ ఎం.వెంకటనారాయణ కోరారు. ఈమేరకు రాజు ఫొటో విడుదల చేశారు.

ప్రతి మంగళవారం స్పెషల్‌డ్రైవ్

- అన్నవరం దేవస్థానంలో కాకినాడ జిల్లా కలెక్టర్ పరిశీలన
- అపరిశుభ్ర వాతావరణంపై అసహనం
- పంపా రిజర్వాయర్‌లో నీటి అంశంపై అధికారులతో చర్చ
- సత్యనికేతన్ సత్రం ఘటనపై త్వరలో చర్యలుంటాయని వెల్లడి



మరుగుదొడ్ల పరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటించారు. సత్యదేవుని దర్శించిన అనంతరం నిత్యకల్యాణమండపం వద్ద నున్న మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంపై అసహనం వ్యక్తం చేశారు. స్వామివారి కల్యాణకట్ట వద్ద పరిసరాల అపరిశుభ్రతను గమనించి ప్రతి మంగళవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఈవో సుబ్బారావుకు సూచించారు. అనంతరం పంపా రిజర్వాయర్‌లో నీరు అడుగంటిపోవడం తద్వారా గ్రామంలో నీటిఎద్దడి పొంచి ఉన్న నేపథ్యంలో దాని నివారణకు చర్యలపై పోలవరం, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. సీతారాముల దివ్యకల్యాణోత్సవాలలో చక్రస్నానం, సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాల చక్రస్నానానికి రిజర్వాయిర్‌లో నీటి అవసరాలపై చర్చించారు. పోలవరం అక్విడెక్టు వద్ద పనుల నేపథ్యంలో ఏలేరు నీరు పంపారిజర్వాయిర్‌కు మళ్లించడంపై సుమారు 10 కిలోమీటర్ల మట్టిరోడ్డులో ప్రయాణం చేసి పనులు పరిశీలించారు. పోలవరం పనులు త్వరితగతిన పూర్తిచేయాలనే ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో పనులకు ఆటంకం కలగకుండా ఏలేరు నీటిని పంపాకు మళ్లించడంలో సాధ్యసాధ్యాలపై ఇరిగేషన్, పోలవరం అధికారులతో చర్చించారు. దీనిపై 3 రోజుల్లోగా నివేదికను ఇవ్వాలని పోలవరం అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించామని.. పంటపొలాల విషయం ఎలా ఉన్నా తాగునీరు పూర్తిస్థాయిలో లేకుంటే ఇబ్బందులు వస్తాయని, అందువల్ల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సత్యనికేతన్ సత్రంలో మద్యంబాటిళ్ల దొరికిన ఘటనపై ఆయన స్పందించారు. ఇప్పటికే నివేదికను తెప్పించడం జరిగిందని, దీనిపై త్వరలో చర్యలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, పంపా నీటిసంఘం ఛైర్మన్ బైరావర్జుల శ్రీరామచంద్రమూర్తి తదితరులున్నారు.



పోలవరం కెనాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

సత్యదేవుని ఆభరణాలను అప్పగించిన పూర్వపు ఈవో

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని ఖజానాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను మంగళవారం పూర్వపు ఈవో సత్యనారాయణ మూర్తి, ప్రస్తుత ఈవో వీర్ల సుబ్బారావుకు దేవదాయశాఖ జ్యుయలరీ వెరిఫికేషన్ అధికారుల సమక్షంలో అందజేశారు. పనిచేస్తున్న ఈవో బదిలీ సమయంలో నూతనంగా నియమించిన ఈవోకు రికార్డుల ప్రకారం అప్పగించాల్సి ఉంటుంది. అయితే సత్యనారాయణమూర్తి 2023లో బదిలీకాగా తదుపరి చంద్రశేఖర ఆజాద్, రామచంద్రమోహన్ ఈవోలుగా బాధ్యతలు స్వీకరించినా సమయాభావం వల్ల వారు ఆభరణాల అప్పగింత చార్జి తీసుకోలేదు. తాజా ఉత్తర్వుల మేరకు దేవస్థానం ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ మంగళవారం ఈవో సుబ్బారావు పర్యవేక్షణలో స్వీకరించారు. ఇకపై ఈవో నుంచి ఈవోకు కాకుండా డిప్యూటీ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ ఆధీ నంలో ఈ ఆభరణాలు ఉంటాయి. డిప్యూటీ కమిషనర్ బదిలీ అయితే తదుపరి డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. సత్యదేవునికి సుమారు 70 కిలోల బంగారం, 3 వేల కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్టు తెలుస్తుంది.



ఆభరణాలను అప్పగిస్తున్న పూర్వపు ఈవో

పాఠశాలలో సిమెంటు బస్తాల వ్యవహారంపై కోనసీమ కలెక్టర్ సీరియస్!

- చీఫ్ సూపరింటెండెంట్, హెచ్‌ఎంలపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశం
- డీఈవో సలీంబాషా వెల్లడి

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో నల్లవంతెన వద్ద గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ముందు సిమెంటు బస్తాల తరలింపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పందించారు. ఈ వ్యవహారంపై వచ్చిన వార్తా కథనాలపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారని ఆర్డీవో కె.మాధవి, డీఈవో షేక్ సలీంబాషాలు విచారణాధికారులుగా విచారణ చేసి నివేదికను కలెక్టర్ పరిశీలన కోసం పంపించారు. దీనిలో భాగంగా పరీక్షా సమయానికి కొన్ని గంటల ముందే సిమెంటు బస్తాలు తరలించడం వాస్తవమని నిర్ధారించారు. దాంతో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మీనాకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ అలసత్వం వహించినట్టు విచారణలో వెల్లడి కావడంతో వారిపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశించినట్టు డీఈవో ఆ ప్రకటనలో తెలిపారు. వారిద్దరిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని డీఈవో విజ్ఞప్తి చేశారు.

పేకాడుతున్న 19 మంది అరెస్ట్



జి.దొంతమూరులో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐలు

రంగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ ఆధ్వర్యంలో మంగళవారం రంగంపేట, అనపర్తి ఎస్‌ఐలు తోట కృష్ణసాయి, ఎల్.శ్రీనునాయక్ సిబ్బందితో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామశివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 19 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,09,300 నగదు, 9 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని రంగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రంగంపేట ఎస్‌ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



ట్రాఫిక్ ఎస్‌ఐతో బాలుడు

సామర్లకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట పోలీస్ అవుట్ పోస్ట్ సమీపాన రోడ్డుపై సుమారు 10ఏళ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో చేతిలో సెల్‌ఫోన్ పట్టుకుని తిరుగుతుండడాన్ని ట్రాఫిక్ పోలీసు సన్యాసిరావు, ఇతరులు గుర్తించి చేరదీశారు. బాలుడిని ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు వద్దకు చేర్చారు. దీంతో పోలీసులు బాలుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో నంబర్ల ఆధారంగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో చూపించారు. వారు రావడంతో ట్రాఫిక్ ఎస్‌ఐ గరగారావు బాలుడిని అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించిన ట్రాఫిక్ ఎస్‌ఐ గరగారావు, పోలీసులకు తండ్రి బాంబీరామ్ వల్లీయప్పన్ కృతజ్ఞతలు తెలిపాడు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

- 32 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి స్వాధీనం



ఏలేశ్వరంలో వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ



స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు ఆభరణాలు

ఏలేశ్వరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత నెల 9వ తేదీన కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని శ్రీసిద్ధనాద్ జ్యూయలర్స్ నందు జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న జ్యూయలరీ దుకాణం వెనుక భాగం నుంచి ఆగంతకులు చొరబడి 50 గ్రాముల బంగారు ఆభరాలు, 32 కిలోల వెండి అపహరించిన విషయం విదితమే. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ రామలింగేశ్వరరావు దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు యర్రవరం వెళ్లే రోడ్డులో తిరుమాలి జంక్షన్ దగ్గర వాహనాలకు తనిఖీ చేస్తుండగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి వివరాలను తెలుసుకున్నారు. కడప జిల్లా రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన కరణం కుమార్, అల్లూరి మండలం చలంగారిపల్లె గ్రామానికి చెందిన గుమ్మళ్ల వెంకట సుబ్బయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపై రాష్ట్రంలో పలు కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఏలేశ్వరం దోపిడీకి సంబంధించి 32 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. కేసును చేదించిన సీఐ,ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

రామచంద్రపురం (ద్రాక్షారామ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మంగళవారం సాయంత్రం మార్కెట్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కెఎస్‌ఆర్ నగర్‌కు చెందిన పల్లె జీవరత్నం (70) మృతిచెందాడు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. జీవరత్నం మోటారు సైకిల్‌పై పాతబస్టాండు నుంచి కెఎస్‌ఆర్ నగర్ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న సాలూరు డిపోకు చెందిన బస్సు వెనుక చక్రం కింద పడిపోయాడు. స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి...

తుని రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రేగుపాలెం యలమంచిలి మధ్యలో జరిగింది. సుమారు 50ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరచినట్టు ఇన్‌చార్జ్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. వివరాలు తెలిస్తే 9490619020లో సంప్రదించాలని కోరారు.

అన్నవరంలో అపూర్వ స్వాగతం

- సైకిల్ ర్యాలీ చేస్తున్న సీఐఎస్‌ఎఫ్ బృందానికి హారతులిచ్చిన మహిళలు



బృంద సభ్యులకు హారతి ఇస్తున్న మహిళలు

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమృద్ధి, సంరక్షణ పేరుతో దేశంలో ఉన్న 6500 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంత ప్రజల్లో దేశ భద్రత, సమైక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో చేపట్టిన సీఐఎస్ఎఫ్ (కేంద్ర పారిశ్రామిక భద్రత దళం) చేపట్టిన సైకిల్ ర్యాలీకి కాకినాడ జిల్లా అన్నవరంలో అపూర్వ స్వాగతం లభించింది. గ్రామంలోకి చేరుకోగానే సర్పంచ్ కుమార్‌రాజా స్వాగతం పలకగా మహిళలు హారతులిచ్చారు. మార్చి 7న పశ్చిమబెంగాల్ బీకీలీ నుంచి 60మంది సీఐఎస్ఎఫ్ దళంతో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర 2700 కిలోమీటర్ల సాగి కన్యాకుమారితో ముగుస్తుందని బృందం పేర్కొంది. ఈ దళం ఏర్పాటై మార్చి 10 నాటికి 55 ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. మంగళవారం రాత్రికి అన్నవరం సత్యదేవుని సన్నిధిలో బస చేసి బుధవారం ర్యాలీ ప్రారంభిస్తామన్నారు.



అన్నవరం చేరుకున్న సీఐఎస్ఎఫ్ బృందంతో స్థానికులు

రుణాలిప్పిస్తామని మోసం

- రూ.2,500 చొప్పున వసూలు

సర్పవరం జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి సంఘాల గ్రూపులకు రుణాలిప్పిస్తామని చెప్పి ఒక్కో గ్రూపు సభ్యుల నుంచి రూ.25వేలు వసూలు చేసి మోసం చేసినట్టు పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వలసపాకలలోని బంధన్ బ్యాంకులో డ్వాక్రా సభ్యులకు రుణాలు ఇప్పిస్తామని చెప్పి బ్యాంకుకి చెందిన ఇద్దరు క్షేత్రస్థాయి సిబ్బంది 3గ్రూపుల నుంచి ఒక్కో సభ్యురాలి నుంచి రూ.2,500 చొప్పున వసూలు చేశారని పలువురు మహిళలు ఆరోపించారు. పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేయిస్తానని నమ్మబలికిన బ్యాంకు రికవరీ సిబ్బంది గణేష్, ఉదయ్‌భాస్కర్ తన వద్ద నుంచి రూ.1.45 లక్షలు తీసుకున్నారని ఏడిద సూర్యకుమారి తెలిపింది. మరో గ్రూపునకు రుణాల మంజూరు కోసం రూ.2.30 లక్షలు తీసుకున్నట్టు ఆర్.చిన్నఅమ్ములు తెలిపింది. లోన్ కోసం లంచం తీసుకున్నా లోన్ మంజూరు కాకపోవడంతో వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని బంధన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ సూరిబాబుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. విచారణ జరిపి న్యాయం చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్టు తెలిపింది. ఈ విషయమై మేనేజర్‌ని వివరణ కోరగా ఇద్దరు సిబ్బందిపై విచారణ నిర్వహిస్తున్నట్టు సూరిబాబు తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా బ్యాంకుకి వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాళ్లపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా పెద్దేవం శివారులో రావూరుపాడు బస్ షెల్టరు వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మరణించిన వ్యక్తి వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుంది. 4రోజులుగా ఇక్కడేఉంటూ చుట్టుపక్కల వారు పెట్టింది తింటూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు తెలిస్తే తాళ్లపూడి పోలీసులకు తెలపాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పంటబోదెలో మృతదేహం

ద్రాక్షారామ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ- కోటిపల్లి రోడ్డు పక్క పంటబోదెలో అన్నాయిపేటకు చెందిన గట్టి సతీష్ (44)మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. మృతుడి భార్య గట్టి పెద్దింట్లమ్మ ఫిర్యాదుతో హెచ్‌సీ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. సతీష్‌కు తరచూ ఫిట్స్ వస్తుంటాయి. 2రోజుల క్రితం బయటకు వెళ్లిన సతీష్ తిరిగిరాలేదు. ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని, తన భర్త మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని భార్య ఫిర్యాదులో పేర్కొందని పోలీసులు తెలిపారు.

తుపాకీతో సంచారం

- పోలీసుల అదుపులో అనుమానితుడు

కాకినాడ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు స్టేట్ బ్యాంక్ సమీపంలో తుపాకీతో సంచరిస్తున్న ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని తిమ్మాపురం పోలీసులు కాకినాడ రూరల్ పోలీస్ కార్యాలయానికి తరలించారు. సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. సదరు వ్యక్తి బ్యాంక్ కొల్లగొట్టడానికి వచ్చాడన్న ప్రాథమిక సమాచారంతో విచారణ చేపట్టారు. వాస్తవాలు వెల్లడి కావడంతో ఆ దిశగా పోలీసులు నిర్ధారణ చేసుకున్నారు. అనుమానితుడిని పోలీసులు విచారిస్తున్నారు.

రాజానగరం అభివృద్ధికి సహకరించండి

» అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో బత్తుల భేటీ

» నియోజకవర్గ సమస్యలపై వినతి


సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గ అభివృద్ధి సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రితో ఆయన మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో ప్రభుత్వం సేకరించిన భూములకు నష్ట పరిహారం చెల్లించాలని, కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని సీఎంకు విన్నవించారు. అలాగే రూ.681 కోట్లతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి, నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలన్నారు. తొర్రేడు-సీతానగరం అర్అండ్‌బీ రోడ్డు, సీతానగరం-పురుషోత్తపట్నం పంచాయతీ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కోరుకొండ ఆలయ అభివృద్ధికి రూ.36 కోట్లతో ఇచ్చిన డీపీఆర్ కార్యరూపం దాల్చేలా సహకరించాలని, ఇళ్ల స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాబోయే పుష్కరాల దృష్ట్యా సీతానగరం ప్రాంతంలో 8 ఘాట్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ధాన్యం రైతులకు బకాయిలు చెల్లించాలని కోరారు. ఆయా అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు.

విద్యా లక్ష్యాలు సాధించడానికే యూనివర్సిటీలు

కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ

దివాన్‌చెరువు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో సామాజిక అవసరాలు, విద్యాలక్ష్యాలు సాధించడానికి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయాచార్యుడు తరపట్ల సత్యనారాయణ అన్నారు. నన్నయ వర్సిటీ గేటు వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిసభల పోస్టరును మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక అవసరాలు తీర్చే విధంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉండాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, యువతకు స్ఫూర్తి ప్రదాతలు అయిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఈనెల 23న జరిగే సభలు, సదస్సులు, కొవ్వొత్తులర్యాలీలు, కాగడాల ప్రదర్శనలను జయప్రదం చేయాలన్నారు. దేశం కోసం చిన్నవయస్సులోనే దేశభక్తిని గుండెలనిండా నింపుకున్న వీరిత్యాగాలను నేటి యువత గుర్తించి ముందుకు సాగాలన్నారు. పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగరకార్యదర్శి దినేష్, మణికంఠ సంతోష్, వంశీ, అప్పారావురెడ్డి, సోమశేఖరరెడ్డి, బాలుదొర, చంద్రశేఖరరెడ్డి, రోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాల నియామకానికి

దరఖాస్తుల ఆహ్వానం

ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి

రాజానగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు రాజానగరం పరిధిలో వివిధ మండలాల్లో ఖాళీలు ఏర్పడిన అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయాలు) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో టి.నాగమణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాజానగరం మండలం పాలచర్ల-1 కేంద్రంలో ఒక పోస్టు, పాతతుంగపాడు-2లో ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం-16లో ఒకటి, పిడింగొయ్యి-3లో ఒకటి, కడియం మండలంలో కడియం-5లో ఒకటి, వేమగిరి-4లో ఒక పోస్టు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు రాజానగరంలోని తమ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, 2024 జూలై 1 నాటికి 21 నిండి 35 సంవత్సరాలు వయసు కలిగి, స్థానికులై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తమ కార్యాలయంలో అందజేయాలని సీడీపీవో నాగమణి తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ తప్పనిసరి

త్వరలో అందరికీ స్మార్ట్ రేషన్‌కార్డుల జారీ

రంగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని పౌరసరఫరాలు డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ ఈకేవైసీ డేటా అంతా తమ గ్రామంలో ఉన్న రేషన్‌డీలర్ వద్ద ఉంటుందని, కుటుంబంలో ఉన్న కొంతమంది సభ్యుల డేటా ఈకేవైసీ అవ్వలేదని, ఈ విషయంపై ప్రజలందరికీ అవగాహన కల్పించి వారంలో రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయించుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని రేషన్‌షాపు డీలరు, ఎండీయూ ఆపరేటర్, స్థానిక వీఆర్వోలను ఆయన కోరారు. ఈకేవైసీ అయిన కుటుంబ సభ్యులకు మాత్రమే రేషన్ వస్తుందని, అవ్వని వారికి రాదని పేర్కొన్నారు. అలాగే ఇతర ప్రభుత్వ పథకాలు పొందేందుకు అనర్హులవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పాత రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్ పీడీఎఫ్ కార్డులు ఇవ్వబోతుందన్నారు. అందులో క్యూఆర్ కోడ్ ద్వారా ఈకేవైసీ అయిన కుటుంబసభ్యులకు మాత్రమే రేషన్ ఇస్తుందన్నారు. కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని సివిల్ సప్లై డీటీ కోరారు.

ఒనువులమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రేడులో ఒనువులమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉత్సవ మూర్తికి భక్తులు క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో మహిళలు కలశాలతో గ్రామ పురవీధుల్లో ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమ పూజ, సహస్రనామ పుష్పార్చన చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాడు పార్టీ మారితే.. నేడు తీసుకోవద్దు!

మాజీ కార్పొరేటర్ వెలుగుకుమారి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు వైసీపీలోకి పోయి పార్టీకి తీరని ద్రోహం చేసిన వారు ఇప్పుడు మళ్లీ పార్టీ వైపు చూస్తున్నారని అటువంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోను రానివ్వొద్దని మాజీ కార్పొరేటర్, టీడీపీ అంగన్వాడీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పల వెలుగుకుమారి కోరారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు మొదలుకొని ఎమ్మెల్యేల వరకు అందరూ ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. వైసీపీకి చెందిన పాలిక శ్రీను టీడీపీలోకి వచ్చేందుకు మార్గాలు వెతుకుంటున్నట్టు తెలిసిందన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించకూడదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణ, నగర బోయిన రామకృష్ణ, దంగేటి అన్నవరం, పొలవరపు రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అయోడిన్ లోప నిర్ధారణ పరీక్షలు



సీతానగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటవరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో జాతీయ అయోడిన్ లోప కారక వ్యాధుల నియంత్రణ (ఎన్ఐడీడీసీపీ) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఉన్న 90 మంది విద్యార్థులకు అయోడిన్ లోపం వల్ల వచ్చే గాయిటర్, బుద్ధిమాంద్యం, శారీరక ఎదుగుదలలో లోపం వంటి లక్షణాలు ఏమైనా ఉన్నాయా లేదా అని పరీక్షించినట్టు చెప్పారు. నలుగురు పిల్లలకు స్వల్పంగా గాయిటర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. పిల్లల గృహాల్లో అయోడిన్ ఉప్పు వాడక నిర్ధారణ కోసం పిల్లల మూత్ర శాంపిల్స్ వారి ఇంటిలో వాడుతున్న ఉప్పు శాంపిల్స్ సేకరించి జిల్లా వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయానికి పంపించామని డాక్టర్ చైతన్య చెప్పారు. ప్రతి ఒక్కరు అయోడైజ్డ్ ఉప్పు మాత్రమే వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ యర్రా సుబ్బారాయుడు, ప్రధానోపాధ్యాయురాలు టి వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు రేపు వేలం

బిక్కవోలు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో సీజ్ చేసిన మోటారు వెహికల్స్‌కు ఈనెల 20న పోలీస్‌స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ మంగళవారం తెలిపారు. వీటిలో 19 మోటారు సైకిళ్లు, 2 ఆటోలు, ఒక కారు ఉన్నాయన్నారు. స్థానిక తహశీల్దార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఆదిత్య విద్యార్థుల ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష వ్యోమగామి సునీత విలియమ్స్‌కు మద్దతుగా ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు 120 మంది కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ రామాలయం మీదుగా జయహో సునీత నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బలభద్రపురం పెద్దచెరువు పరిశీలన


పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారుల బృందం

చెరువు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక బృందం ఆరా

అనపర్తి మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం బలభద్రపురంలో గత ప్రభుత్వంలో రూ.1.50కోట్ల రుడా నిధులతో చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను మంగళవారం రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధికారుల బృందం పరిశీలించింది. గతంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెరువు అభివృద్ధి పనులు, పనుల్లో జరిగిన అవినీతిపైనా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ చెరువు అభివృద్ధి పనులు, అవినీతిని నిగ్గుతేల్చేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం చెరువు వద్దకు చేరుకున్న అధికారులు వాటర్ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోకు చేయాల్సిన ఏర్పాటును, వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేయడంతో బాటు చిన్నారులకు ఏర్పాటు చేయాల్సిన పార్కు, చెరువు చుట్టూ లైటింగ్, చెరువులో అస్తవ్యస్తంగా ఉన్న గర్భాన్ని, సరిచేయాల్సిన పనులను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పనుల్లో అవినీతిపై చేపట్టిన చర్యలపై ప్రశ్నించగా పనులకు సంబంధించిన ఎమ్-బుక్కులను పంచాయతీకి అందజేస్తామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. బృందంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ ఆలీ, ఇరిగేషన్ డీఈఈ ఆనందకుమార్, తహశీల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఉన్నారు. ఈ సందర్భంగా నల్లమిల్లి సుబ్బారెడ్డి పనుల్లో జరిగిన అవినీతి, లోపించిన నాణ్యతను అధికారులకు వివరించారు.

ఫిషర్‌మెన్ సొసైటీ లీజుపై డీఎల్‌పీవో..

ఇదిలా ఉండగా అభివృద్ధి పనుల పేరుతో రెండేళ్లుగా పెద్ద చెరువు మూత పడినప్పటికీ పంచాయతీలో ఫిషర్‌మెన్ సొసైటీ పేరున లీజు ఉంది. దీనిపై ఫిషర్‌మెన్ల ఫిర్యాదుతో డీఎల్‌పీవో నాగవేణి పెద్ద చెరువును పరిశీలించారు. అభివృద్ధి పేరుతో చెరువును అస్తవ్యస్తంగా తయారు చేయడంతో ఫిషర్‌మెన్లు రెండేళ్లుగా చేపల పెంపకానికి దూరమయ్యారు. అయినా పంచాయతీ అధికారులు లీజు సొమ్ములు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో వారు ఎమ్మెల్యే నల్లమిల్లి దృష్టికి తీసుకురావడంతో ఆయన జిల్లా అధికారులకు విషయాన్ని వివరించి లీజు రద్దు చేయాలని సూచించారు. దీంతో డీఎల్‌పీవో చెరువును పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి కిరీటం బహూకరణ



ధవళేశ్వరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు గ్రంధి లక్ష్మీమోహన కల్యాణ చక్రవర్తి వెండి కిరీటం బహూకరించారు. మంగళవారం ఉదయం ఆలయ కమిటీ సభ్యు ల సమక్షంలో కిరీటానికి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు జరిపి స్వామికి అలంకరించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, అప్పన మూర్తి, వై.రామచంద్రమూర్తి, గ్రంధి సత్యనారాయణ మూర్తి, ఐవీవీ సత్యనారాయణ, కందుల నరసింహమూర్తి, కె.సతీష్ పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ అధ్యాపకులంతా పరిశోధనలపై దృష్టి సారించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్సిటీ ప్రాంగణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశమై మాట్లాడుతూ అన్ని విభాగాలు సదస్సులు నిర్వహిస్తూ పరిశోధన పత్రాలు రాయాలన్నారు. విశ్వవిద్యాలయానికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించే దిశగా అడుగులు వేద్దామన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే పరీక్షలు జరుగుతాయని, దానికి తగ్గట్టుగా అధ్యాపకులు పాఠాలు పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని చెప్పారు. కళాశాల ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల్లో నిర్వహిస్తున్న కోర్సులు తదితర వివరాలను ప్రిన్సిపాల్స్ డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మలను అడిగి తెల్సుకున్నారు. విశ్వవిద్యాలయంలో భవనాల కొరత కారణంగా కొన్ని తరగతులు షిఫ్ట్ విధానంలో నడుస్తున్నాయని వారు వీసీ ప్రసన్నశ్రీకి వివరించారు.

అసంపూర్తి ఇళ్లకు అదనపు ఆర్థిక సహాయం

హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు

కోరుకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 విజన్ సహకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళ్లు కార్యక్రమంలో ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్టు గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని గాడాల గ్రామంలో పలువురు లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కోరుకొండ మండల పరిధిలో 517 మంది గృహ లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. వీరికి ప్రభుత్వం అదనంగా అందిస్తున్న ఆర్థిక సహాయం గురించి అవగాహన కార్యక్రమం చేపట్టామన్నారు. మండల పరిధిలో 517 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 123 మందికి సమాచారం అందించామన్నారు. వారిలో 120 మందిని నేరుగా కలిశామన్నారు. ఇంటి నిర్మాణం కోసం 89 మంది లబ్ధిదారులు ఆసక్తి చూపించారన్నారు. మే నెలాఖరు నాటికి ఇంటి నిర్మాణం పూర్తి చేసేలా అవగాహన కల్పించామన్నారు.

వేర్వేరు ఘటనల్లో బంగారం చోరీ

రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో బంగారు ఆభరణాల చోరీపై బొమ్మూరు, ప్రకాశం నగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. శ్రీకాకుళం చెందిన ఎస్.వెంకటరమణ ఫిబ్రవరి 12న హుకుంపేటలోని బంధువుల ఇంటికి ఓ వేడుకకు వచ్చారు. ఇక్కడి వచ్చిన తర్వాత చూడగా బ్యాగులో 97గ్రాముల బంగారం లేదని ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఉమా సావిత్రి జనవరిలో సంక్రాంతికి శాటిలైట్ సిటీలోని అమ్మగారింటికి వచ్చారు. అయితే తాను తిరిగి వెళ్లి చూసుకోగా బంగారు ఆభరణాలు లేవని ఫిర్యాదు ఇచ్చారు. విద్యుత్ కాలనీకి చెందిన పార్వతి(63) ఏవీ అప్పారావు రోడ్డు మహాలక్ష్మీ ఆలయం రోడ్డులో ఉదయం వాకింగ్ వెళ్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన దుండగులు తన మెడలోని 26 గ్రాముల గొలుసు దొంగిలించారని ఫిర్యాదు చేశారు.

సారా నియంత్రణకు ప్రజల్లో అవగాహన

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీఈపీవో లావణ్య


సదస్సులో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈపీవో లావణ్య

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 18(ఆంధ్రజ్యోతి): సారా నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీఈపీవో సీహెచ్ లావణ్య అన్నారు. మండలంలోని వెంకటనగరంలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సారా వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, సారా తయారీ, వినియోగానికి సంబంధించి ఏబీసీ కేటగిరి గ్రామాలను గుర్తించామన్నారు. ఆ మేరకు ఎక్కువ మొత్తంలో సారా తయారీ, వినియోగం వల్ల వెంటకనగరం గ్రామాన్ని ఏ కేటగిరి కింద గుర్తించి సారా తాగడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సారా అమ్మకాలు తయారీ స్థావరాలు వివరాలు తెలియజేయాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఈపీవో లావణ్య అన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శివప్రసాద్, నార్త్ ఇన్‌స్పెక్టర్ ఆర్.త్రినాథ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందాల శిబిరంపై దాడి

ఆరుగురు వ్యక్తుల అరెస్ట్



గోకవరం, మార్చి18(ఆంధ్రజ్యోతి): కోడి పందాల శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ వీఎన్‌వీ పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని ఇటికాయిలపల్లి గ్రామ శివారున కోడి పందాలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు కోరుకొండ ఎస్ఐ శ్యామ్‌సుందర్, సిబ్బందితో తాము కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,200 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కోరుకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ ఆర్టీసీకాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న కిళ్లీకొట్టులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎ.రాజబాబు అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్యామసుందర్ తెలిపారు. అతడి నుంచి రూ.4400 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేశామన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు

అంతరాయం

బిక్కవోలు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని బలభద్రపురం, కాపవరం, గంగులూరి పాకలులో ఈనెల 20న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఆపరేషన్ దాట్ల శ్రీధర్‌వర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేసే నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

వ్యవసాయ కార్మికులు అగ్రిస్టాక్ కింద

రైతు రిజిస్ట్రీలో చేరుతారా ?: ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్దసంఖ్యలో ఉన్న వ్యవసాయ కార్మికులు అగ్రిస్టాక్ కింద రైతు రిజిస్ట్రీలో చేర్చబడతారా లేదా అనేది వెల్లడించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు రైతు రిజిస్ట్రీలో చేర్చబడకపోవడం వల్ల వివిధ సంక్షేమ పథకాలను కోల్పోతున్నారని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 37 శాతం మంది రైతులు, కౌలు రైతులు ఉన్నారని, వీరు వ్యవసాయ ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆమె వివరించారు.

రెడ్డి సంఘమంటూ వసూళ్లతో గందరగోళం

రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రెడ్ల సంఘమంటూ విరాళాలు వసూలు చేస్తున్నారనే విషయంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు నల్లకాలవ శ్రీ భగవాన్ కాశీరెడ్డినాయన ఆశ్రమం నిత్యాన్నదాన ట్రస్టు పేరుతో ఆ ట్రస్టు ట్రెజరర్ మరో ఐదుగురు విరాళాల కోసం రాజమహేంద్రవరం వచ్చారు. నగరంలోని ప్రముఖ రెడ్డి కులస్తుల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రినాథరెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయన అనుమానం వచ్చి అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణకు సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు త్రినాథరెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ ఆరా తీసిన అనంతరం వాళ్లను పోలీస్ స్టేషనుకు తీసుకొచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఆత్మకూరు సీఐకి సమాచారం ఇవ్వగా.. అక్కడ ఆశ్రమం ఉందని, నిత్యాన్నదానం చేస్తుంటారని, విరాళాలు స్వీకరిస్తారని చెప్పారు. దీంతో పోలీసులు వాళ్లను పంపేశారు. అయితే రెండు సంవత్సరాల నుంచి రెడ్డి సంఘాలని చెప్పుకుంటూ వసూళ్లు చేస్తున్నారని త్రినాథరెడ్డి చెబుతున్నారు. ఈ విషయంపై ఆత్మకూరు వెళ్లి ఫిర్యాదు చేస్తామన్నారు. ఇక్కడి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు కాలేదు.

జేఎన్టీయూకే టెక్ ఫెస్ట్‌లో గైట్ విద్యార్థుల ప్రతిభ

రాజానగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ కాకినాడలో ఇటీవల జరిగిన టెక్నికల్ ఉత్సవంలో గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించినట్టు ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ తెలిపారు. కళాశాలలోని ఆటోమొబైల్ విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులు చిన్నాల హరి, ఎన్.రుద్రేష్ ప్రదర్శించిన పరిశోధన పత్రానికి ప్రథమ బహుమతి లభించిందన్నారు. అలాగే కావ్య శ్రీమానే, సాయి ప్రవీణ, వంగా అయ్యప్ప, భాను ప్రకాష్, మాధవి, మణిరత్నం, బెనర్జీ నాయుడు పలు ప్రాజెక్టులు ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి.సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

'సత్యసాయి' యూనియన్ సమ్మె విరమణ

సీతానగరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపట్నంలోని శ్రీ సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ యూనియన్ చేపట్టిన సమ్మెను విరమిస్తున్నట్టు యూనియన్ అధ్యక్షుడు కట్ట మూరి వీరబాబు తెలిపారు.మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రశాంతితో జరిపిన చర్చలు సఫలం అయినందున సమ్మె విరమిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ నుంచి యథావిధిగా తాగునీరు విడుదల చేస్తామన్నారు. దీంతో దేవీపట్నం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, రాజానగరం, మండల గ్రామాల ప్రజలు బుధవారం నుంచి సత్యసాయి మంచినీరు పొందనున్నారు.

న్యాయవాదుల వినతి

రాజమహేంద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ రెవెన్యూ కోర్టుల్లో ప్రాక్టీస్ చేసే న్యాయవాదులు,గవర్నమెంట్ ఏజెంట్ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలనే నిర్ణయం సరైంది కాదని తక్షణం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మాలకోట వెంకటేశ్వరరావు అన్నారు.అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల అనంతరావు, బీర అరుణ్‌కుమార్, ముప్పిడి సుధీర్‌కుమార్, ఎం.చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో సుజాతకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

వైసీపీ బలోపేతానికి కృషి

గోకవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తండ్రి జ్యోతుల రామస్వామి అన్నారు. మండలంలోని గంగంపాలెం, ఠాకూరుపాలెం, తిరుమలాయపాలెం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, బావాజీపేట, వెదురుపాక, గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో భారీ సమావేశం ఏర్పాటు చేస్తానని జ్యోతుల రామస్వామి అన్నారు.

వివాహితకు కట్నం వేధింపులు

భర్త, అత్తమామలపై ఫిర్యాదు

సీతానగరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనవరం గ్రామానికి చెందిన సత్తి మణిమాల ఫిర్యాదు మేరకు భర్త సత్తి సోమశేఖర్, అత్తమావలపై వరకట్నం కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. 2013లో గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన సత్తి సోమశేఖర్‌తో మణిమాలకు వివాహం జరిగింది. 2019 నుంచి భార్యపై అనుమానంతోను, అధిక వరకట్నం కోసం తనను శారీరకంగా, మానసికంగా భర్తతోపాటు అత్త అనంతలక్ష్మి, మావ కృష్ణమూర్తి వేధిస్తున్నారని మణిమాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం కోసం..

రాజమహేంద్రవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): లాలాచెరువు చౌడేశ్వరీనగర్‌కి చెందిన పద్మావతి తనను భర్త వినాయక్ అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేశామని సీఐ అప్పారావు తెలిపారు.

'చలో ఢిల్లీ'కి డాక్టర్ అనుసూరి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో మహిళలకు 33 శాతంలో బీసీ మహిళలకు 50శాతం సబ్ కోటా కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18,19 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి రాజమహేంద్రవరానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత తరలివెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ సెమినార్ జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ అధ్యక్షతన జరిగింది. దీనికి జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి పద్మలత హాజరయ్యారు. బీసీ మహిళా సబ్ కోటాకు రాజ్యాంగ బద్ధంగా రక్షణ కల్పించాలని, పార్లమెంట్ సమావేశాల్లో బిల్ ప్రవేశ పెట్టాలని వారు డిమాండ్ చేశారు.





సత్యసాయి పథకం కార్మికులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సత్యసాయి కార్మికులతో నేడు పవన్ భేటీ

నిన్న అసెంబ్లీలో ఎమ్మెల్యే చెప్పారు.. డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు!

రాజమహేంద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అసెంబ్లీలో సత్యసాయి వాటర్ స్కీమ్ కార్మికుల సమస్యలపై సోమవారం గళమెత్తారు. మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు. దీనిపై ఆ వెంటనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. సమస్య పరిష్కారం కోసం చర్చిద్దామని బుధవారం సాయంత్రం అమరావతికి రావాలని యూనియన్ నేతలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆహ్వానం పంపారు. ఇదిలా ఉండగా 48 నెలలుగా జీతాలి వ్వకపోవడంతో చేపట్టిన దీక్షను కలెక్టర్ కార్మికులతో చర్చించి మంగళవారం విరమింపజేశారు.సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నుంచి నీటిని పంప్ చేసి వివిధ గ్రామాల మంచినీటి అవసరాలు తీర్చడం కోసం సత్యసాయి ట్రస్ట్ పంపింగ్ స్కీమ్ నిర్మించిన సంగతి తెలిసిందే. చాలా కాలంగా ఇది కొనసాగుతోంది. సీతానగరం,గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని 74 హేబిటేషన్లకు ఈ పథకం ద్వారా మంచినీరు సరఫరా అయ్యేది. దీని కోసం 60 మంది వరకూ పనిచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ కలెక్టర్ పర్యవేక్షించేవారు. వైసీపీ ప్రభుత్వంలో దీనిని అసలు పట్టించుకోలేదు. ఇప్పటి వరకూ మొత్తం 48 నెలల జీతాలు పెండింగ్ ఉండడం గమనార్హం. గత ప్రభుత్వం జీతాలకే కాదు.. నిర్వహణకు సొమ్ములివ్వలేదు.దీంతో తాము జీతాల్లే కుండా పనిచేయలేమని చెబుతూ సోమవారం లాలాచెరువులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట కార్మికులు దీక్ష ఆరంభించారు.కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జోక్యం చేసుకుని వారితో చర్చించడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యూటీ సీఎం చర్చలకు ఆహ్వానించారు. ఈ సమావేశానికి కార్మిక నాయకులతో పాటు ఆర్‌డబ్ల్యు ఎస్ ఎస్ఈ గిరి వెళ్లనున్నారు.

కార్మికుల నెల జీతాలకు రూ.10 లక్షలు : కలెక్టర్

సత్యసాయివాటర్ స్కీమ్ కార్మికుల నెల జీతం కోసం రూ.10 లక్షలు ఇవ్వడానికి తాము చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె మంగళ వారం కార్మికులతో చర్చించారు. వేసవి దృష్ట్యా మంచినీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం రాకూడ దన్నారు.స్థానిక సంస్థల్లో స్కీమ్‌ను విలీనం చేయడం వల్ల నిధులు సాధ్యమవుతాయన్నారు. సత్య సాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ నేతలు కట్టమూరి వీరబాబు, ఉందుర్తి ఇస్సాక్ మాట్లాడుతూ తమకు వచ్చిన హామీ మేరకు దీక్ష విరమిస్తున్నామన్నారు.



నాడు వైసీపీలో నా ఫోన్ హ్యాక్ చేశారు!

అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అందరి ఫోన్లు హ్యాక్ చేశారని..ఆఖరికి నా ఫోన్ కూడా హ్యాక్ అయితే తాను ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి ఐ ఫోనుకు మారాల్సి వచ్చిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇటువంటి పనులతో వైసీపీప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు.కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు సేవలు చేరువ చేసి నీతివంతమైన పాలన చేస్తుందన్నారు. రాష్ట్రంలో వాట్సాప్ పరిపాలన వల్ల ప్రజలకు పారదర్శకమైన సేవలు మరింత చేరువవుతాయని ఐటీ అంటే గుర్తుకు వచ్చేది మన సీఎం చంద్రబాబేనని.. ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్ అంటే మంత్రి నారా లోకేష్ గుర్తుకువస్తున్నారన్నారు. ఐటీ నుంచి ఏఐకి మారడం గొప్పవిషయమని కొనియాడారు.వాట్సాప్ పరిపాలన వల్ల ఉపాధి కోల్పోతామని మీ సేవ నిర్వాహకుల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు.



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వైద్య వృత్తి.. నోబెల్ ప్రొఫెషన్

మెడికల్ కళాశాల తొలి వార్షికోత్సవంలో కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైద్యవృత్తి నోబెల్ ప్రొఫెషన్ అని.. వైద్య విద్యార్థులు వైద్య సేవల్లో నైపుణ్యం పెంచుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రథమ వార్షికోత్సవంలో మంగళవారం ఆమె మాట్లాడారు. వైద్య వృత్తి సేవాభావంతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని మెడికోలు తెలుసుకోవాలని సూచించారు. గతేడాది వైద్య విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించడం శుభపరిణామమన్నారు. వైద్య విద్యార్థులు కష్టపడి చదువుకుని, వైద్యులు అయిన తర్వాత అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలన్నారు.సౌభాగ్యమిత్ర లోగోను కలెక్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై పరికరాలు

జిల్లాకు 1780 పరికరాలు - 26 వరకూ దరఖాస్తు గడువు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వ్యవసాయంలో చిన్న సన్న కారు రైతులకు తోడ్పాటు ఇవ్వడానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం యంత్ర పరికరాలను మంజూరు చేసింది. జిల్లాలో 1780 మంది రైతులకు రూ. 3.92 కోట్లతో 1780 పరికరాలను ఇవ్వనుంది. ఈ పథకానికి ఐదెకరాల్లోపు ఉన్న చిన్న సన్న కారు రైతులు ఎవరైనా అర్హులే.ఒక కుటుంబంలో ఒక రైతుకు ఒక పరికరం ఇస్తారు. 50 శాతం సబ్సిడీ ఉంటుంది.రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకానిజం (ఎస్ఎంఎఎం)కింద పరికరాలు అందించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఐటీడీ) ద్వారా వీటిని అమలుచేయనున్నారు. పరికరాలకు గ్రామాల్లో ఉండే రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ (వీఏఏ)లను సంప్రదించాలి.ఆన్‌లైన్ ద్వారా ఏపీఎస్ఏఐడీసీ లిమిటెడ్‌కు దరఖాస్తు చేస్తారు. అర్హులను ఎంపిక చేస్తారు.

26వ తేదీ వరకే గడువు

వ్యవసాయ పనిముట్లకు రైతులు ఈనెల 26వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విలేజి అగ్రి కల్చరల్ అసిస్టెంట్‌ను సంప్రదించి, అతని ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ అవకాశాన్ని వినియోగించుకుని వచ్చే సీజన్ నుంచే యంత్రాలతో పనిచేసుకోవచ్చు.- మాధవరావు, డీఏవో

ఎవరు అర్హులంటే..

గత ఐదేళ్లలో వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ పొందని వారు. ఎస్సీ,ఎస్టీ రైతులు, మహిళలు, చిన్న, సన్నకారు రైతులు. ఈ- పంటలో నమోదు చేసుకున్న పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న వాస్తవ సాగుదారులే అర్హులు. ఏజెన్సీల్లో అయితే ఆర్‌వోఎఫ్ఆర్ భూములను సాగుచేస్తున్న రైతులు. కుటుంబానికి ఒక లబ్ధిదారుడే. ఒక పనిముట్టు మాత్రమే ఇస్తారు.

రైతులకు సబ్సిడీపై యంత్రాలిలా..

పరికరాలు	జనరల్	ఎస్సీ/ఎస్టీ
బ్యాటరీ స్ప్రేయర్లు	342	108
పవర్ స్ప్రేయర్లు	342	108
ట్రాక్టర్ పరికరాలు	525	165
రోటోవేటర్లు	19	6
పవర్ వీడర్లు	11	4
బ్రష్ కట్టర్లు	7	3
పవర్ టిల్లర్లు	107	33

జిల్లాలో మొత్తం 1780 మంది రైతులకు 17 80 పరికరాలు ఇవ్వనున్నారు. జనరల్ కేటగిరిలో రూ.2.99 కోట్లతో 1353 పరికరాలను 1353 మంది రైతులకు ఇవ్వనున్నారు. మిగిలిన 427 పరికరాలు ఎస్సీలకు 302, ఎస్టీలకు 125 ఇవ్వనున్నారు.

రాజమండ్రికి చెందిన ఓ కాంట్రాక్టరు ఫేస్ బుక్ చూస్తూ ఓ యాడ్‌పై క్లిక్ చేశాడు. ఇంకేముంది..తక్కువ సమయంలో కోట్లు సంపాదించవచ్చని కనబడింది. యాప్ డౌన్‌లోడ్ చేసు కున్నాడు. ముందు కొంత సొమ్ము పెట్టుబడి పెట్టాడు. రెట్టింపు వచ్చినట్టు యాప్‌లో చూపించింది. ఎప్పుడైతే యాప్‌లో తన వివరాలను నమోదు చేశాడో ఇతడి క్రెడిట్ కార్డుల నెంబర్లు, పిన్‌లతో సహా అవతలి వ్యక్తులకు వెళ్లిపోయాయి. మూడు రోజుల్లో అవి ఉపయోగించి రూ.50 లక్షలు దోచేశారు. యాప్ పని చేయడం ఆగిపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఓ యువకుడు ఈజీగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మాత్రమే ఆదాయ మార్గమని తన స్నేహితుడి ద్వారా తెలుసుకున్నాడు. వెంటనే యాప్‌లను డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మొదట రూ.20 నుంచి మొదలు పెట్టిన ఈ ఆటకు అంతే లేకుండా పోయింది.అప్పులు చేసి మరీ ఈ బెట్టింగ్ యాప్‌ల్లో ఆడాడు.. తీవ్రంగా నష్టపోయాడు. తనకున్న సొంతింటిని అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో రెవె న్యూ శాఖలో పనిచేస్తున్న ఒక మహిళా సిబ్బంది భర్త ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు.తన భార్య బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి మరీ బెట్టింగ్ కాసి ఉన్నదంతా పొగొట్టుకున్నాడు.ఏమీ చేయలేని నిస్సహాయతతో ఇంటికి వెళ్లే ధైర్యం లేక అజ్ఞాతంలోకి వెళ్లాడు.

కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన ఒక తాపీ మేస్త్రి బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పులు పాలయ్యాడు.. చివరికి భరించలేక ఇటీవల పేరుపాలెం బీచ్‌కు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు భార్యకు వీడియో పెట్టాడు. కంగారుపడిన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆచూకీ లభించలేదు. తరువాత అతను ఫోన్ చేసి బతికే ఉన్నానని.. బెట్టింగ్‌ల కారణంగా ఇలా చేశానని వాపోయాడు.



ప్రాణాలతో.. సెల్‌గాటం!

పరీమ్యాచ్, బెట్ 365, డ్రాఫ్ట్‌కింగ్స్, ఫాన్ డ్యూయల్, 1ఎక్స్‌బెట్, బెట్‌ఎంజీఎం, టాజ్777, టార్గెట్‌గేమ్స్.. ఇవన్నీ ఏంటో అనుకుంటున్నారా.. బెట్టింగ్‌ల యాప్‌ల పేర్లు.. 'వీటిలో జస్ట్ కొద్దిగా డబ్బులు పెట్టండి.. వెలకమ్ బోనస్ వస్తుంది..' అంటూ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో యాప్‌ల ప్రమోషన్లు చేసి యువతను టెంప్ట్ చేస్తారు.వీటి మాయలో పడిన యువత త్వరగా డబ్బు సంపాదించాలనే కోరికతో డబ్బులు పెట్టీ.. పెట్టీ.. పెట్టీ నష్టపోతున్నారు. అప్పులపాలవుతున్నారు.. చేసిన తప్పును ఎవరికీ చెప్పుకోలేక..ఆ నరకం నుంచి బయటపడలేక ఆత్మహత్య చేసుకోవడమో.. అదృశ్యం కావడమో చేస్తున్నారు.. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లు చేస్తున్న కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ యాప్‌ల బారినపడి నలిగిపోతున్న యువత పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

యాప్‌ల...ట్రాప్‌లో జీవితాలు నాశనం

- బెట్టింగ్ యాప్‌లపై ఆసక్తి
- సోషల్‌మీడియాలో ప్రమోషన్లు
- ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో ప్రచారం
- వలలో పడుతున్న జనం
- ఈజీ మనీ కోసం వెంపర్లాట
- నష్టపోయినా..ఆగని వేట
- తీరని అత్యాశతో అప్పులు
- నిండా మునుగుతున్న వైనం
- ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్య
- గుట్టుగా బెట్టింగ్ వ్యాపారాలు
- తెలంగాణలో కేసులు నమోదు
- ఉమ్మడి జిల్లాల్లో పట్టని పోలీసులు

(రాజమహేంద్రవరం/కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చోరీ కేసులు, గంజాయి రవాణా వంటి నేరాల వెనుక ఆన్‌లైన్ బెట్టింగ్ బూచీ లింక్ అయి ఉంటోంది. నేరాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా యువత, నడి వయస్కులు ఉంటున్నారు. వీళ్ల నేరాల ద్వారా సంపాదించిన సొమ్మును బెట్టింగ్‌లకు వెచ్చిస్తున్నారు. లేదంటే బెట్టింగ్‌ల వల్ల అప్పులపాలై వాటిని తీర్చడానికి వక్రమార్గాన్ని అనుసరిస్తున్నారు. కొంత మంది ప్రాణాలు తీసుకుంటున్నారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కాసుల కక్కుర్తితో ఇస్తున్న ప్రకటనలు మరింత కీడు చేస్తున్నాయి.ఆస్తులు అమ్ముకొని బికారులుగా మిగిలినవాళ్లు, అప్పులు తీర్చడానికి దొంగలుగా మారినవారు ఎంతో మంది. బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీసిన ఘటనలెన్నో. ఇవేవీ బయటకు రావు..పోలీసు కేసుల్లో నమోదు కావు.



స్మార్ట్‌ఫోన్‌లోనే అన్నీ..

నేటి సాంకేతిక యుగంలో బెట్టింగ్ స్మార్ట్ ఫోన్‌లోకి వచ్చేయడంతో యువత ఆసక్తి చూపుతున్నారు. కలర్ ప్రిడిక్షన్, నెంబర్ ప్రిడిక్షన్.. క్రికెట్, కాసినో.. ఇలా అనేక రకాల విదేశీ యాప్‌లు అందుబాటులోకి రావడంతో ఈజీగా డబ్బులు సంపాదించొచ్చనే ఆశతో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.ఎక్కువగా ఉమ్మడి జిల్లాల్లోని గ్రామీణ యువత వీటి బారినపడి నలిగిపోతున్నారు.

అక్కడ లీగల్..ఇక్కడ ఇల్లీగల్?

బెట్టింగ్ యాప్ నిర్వాహకులు అధికశాతం విదేశాల నుంచి ఆపరేట్ చేస్తుంటారు. నైజీరియా, కెన్యా, ఫిలిప్పైన్స్ మెక్సికో వంటి చాలా దేశాల్లో జూదం లీగల్.అంటే జూదాన్ని అక్కడి చట్టాలు అనుమతిస్తాయి. అంతెందుకు మన దేశంలో కేరళ వంటి కొన్ని రాష్ట్రాల్లో లాటరీ టికెట్లను బహిరంగంగా అమ్ముతుంటారు.ఇలా ఒక చోట చట్టబద్ధమైన పని, మరో చోట చట్ట ఉల్లంఘన కింద ఉంటోంది. అందువల్ల బెట్టింగ్ యాప్‌ల్లో సొమ్ము పోగొట్టుకుంటే తిరిగి చేతికి రావడం అసాధ్యం. పోలీసులు ఎంత శ్రమించినా 10 శాతం ఫలితాలు సాధించలేక పోవచ్చు. ఇక్కడ బెట్టింగ్ యాప్‌ల్లో దోచుకున్న సొమ్ము విదేశాల్లోని నేరగాళ్ల ఖాతాలకు చేరుతుంది. దాన్ని వెనక్కి రప్పించడం ఎంతో కష్టం.

విద్యార్థులు, ఉద్యోగులు..

బెట్టింగ్ యాప్‌ల వలలో స్టూడెంట్స్, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వాళ్లూ పడుతున్నారు. ముందు సరదాగా మొదలుపెట్టినా తర్వాత వ్యసనంగా మారిపోతోంది. బెట్టింగ్ యాప్‌ల వలలో ఎక్కువగా చదువుకున్న వారే ఉంటుండడం ఆందోళన కలిగిస్తోందని సర్వేలు చెబుతున్నాయి. ఏఐ సాంకేతికత, ఆల్గారిథమ్స్ వంటి అధునాతన టెక్నాలజీలతో యాప్‌లు తయారు చేస్తుండడంతో యాడ్‌ల రూపంలో ఎలాగైనా డబ్బు సంపాదించాలనే బలహీనతను అవి క్యాష్ చేసుకుంటున్నాయి. యాప్‌ల వలలో పడి నష్టపోతున్న వారు కోకొల్లలు.వీరిలో 99 శాతం మంది పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. మరో వైపు పోలీసులు పట్టించుకోవడంలేదు . బెట్టింగ్ యాప్‌లపై చైతన్యం తీసుకురాలేకపోతున్నారు. దాదాపు 90 శాతం మంది విద్యార్థులు, ఖాళీ సమయం దొరికేవాళ్లు బెట్టింగ్ యాప్‌లపై మొగ్గు చూపుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో క్రికెట్ బెట్టింగ్‌లకు ఏకంగా ఒక కార్యాలయమే తెరిచేశారంటే పోలీసుల నిఘా ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తూర్పు గోదావరిలో 2023లో నిడదవోలు, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేవలం రెండు క్రికెట్ బెట్టింగ్ కేసులు మాత్రమే నమోదు కాగా..2024లో ఒక్క కేసూ నమోదు కాలేదు. 2025లో రాజానగరంలో ఒక్క కేసు నమోదైంది. వాస్తవానికి బెట్టింగ్ యాప్‌ల గురించి యాడ్‌లు ఇచ్చినా..వాటిని ప్రమోట్ చేసినా పోలీసులు కేసులు పెట్టవచ్చు.కానీ ఆ దిశగా ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా లో ఒక్క ప్రయత్నమూ లేదు.

నాడు వైసీపీ నేతల దందా..

ఐపీఎల్, టీ 20 వంటి ఇతర సీజన్ల సమయంలో క్రికెట్ బెట్టింగ్ యథేచ్ఛగా సాగుతోంది. కాకినాడ కేంద్రంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ బెట్టింగ్ భారీగా సాగింది. స్థానిక వైసీపీ నాయకుడి ముఖ్య అనుచరులే ఈ బెట్టింగ్ కార్యకలాపాలకు మధ్యవర్తులుగా ఉండి నిర్వహించేవారు. లక్షలాది రూపాయలు పందేలు కాసిన వారెందరో ఈ క్రికెట్ బెట్టింగ్ బారిన పడి అప్పులపాలైనట్టు తెలుస్తోంది. అప్పట్లో ఎవరూ దీనిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేని పరిస్థితి.ప్రత్యేకంగా బుకీలను ఏర్పాటు చేసుకుని మరీ గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారాన్ని నడిపిన కొందరు కోట్లు సంపాదిస్తున్నారు. ఈ తరహా ఇతర ప్రాంతాల్లో కూడా కొందరు వెనకుండి యాప్‌లను నిర్వహి స్తూ యువతను బెట్టింగ్ మాయలోకి దింపుతున్నారు.



ఈ నెల 3న రాజానగరంలో పట్టుబడిన క్రికెట్ బుకీలు

మనోళ్లే..క్రికెట్ బుకీలుగా..

రాయవరం : ఈ నెల 3న జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇండియా-ఆస్ట్రేలియా లీగ్ మ్యాచ్‌పై రాయవరం మండలం సోమేశ్వరం, రాజానగరం మండలం చక్రద్వారబంధంలో ఆరుగురు క్రికె ట్ బుకీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.4 ల్యాప్‌టాప్‌లు,50 సెల్‌ఫోన్లు, రెండు ఎల్ఈడీ టీవీలు, రెండు లైన్‌బాక్స్‌లు,రూ.7.38 లక్షల నగదు కలిగిన బ్యాంక్ ఖాతా ఫ్రీజ్‌చేశారు.

రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం బ్రిడ్జి కౌంటీలోని బి-12 విల్లాలో దుబాయ్ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు పోలీసులు నిర్ధారించారు. కర్ణాటక,భీమవరానికి చెందిన 12 మందిని అరెస్టు చేశారు.ఈ ముఠాలో భీమవరానికి చెందిన వినీత్ దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి పలు రకాల పేర్లతో వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నట్టు తెలు సుకున్నారు. ఇటీవల ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తుండగా అరెస్టు చేశారు.

బల్లిపాడులో అర్ధరాత్రి ఇసుక డ్రెడ్జింగ్

తాళపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపులో మంగళవారం రాత్రి మైనింగ్, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు.ఈ దాడుల్లో డ్రెడ్జింగ్ పడవ,ఇసుకను అన్‌లోడ్ చేస్తున్న మిష న్,ఇసుక రవాణాకు వినియో గించే వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి, తాళ్లపూడి రెవెన్యూ సిబ్బంది మంగళవారం రాత్రి ఆకస్మికంగా దాడి చేశారు. ఇసుక ర్యాంప్ నిర్వాహకులను ప్రశ్నించి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. డ్రెడ్జింగ్ బోటును సీజ్ చేసిన ప్రాంతం తాళ్లపూడి మండ లం వేగేశ్వరపు రం పరిధి అని తేలింద న్నారు.ఈ దాడిలో మైనింగ్ ఏడీతో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మైన్స్ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బిల్లు లేని ఇసుక లారీ సీజ్

కొవ్వూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బిల్లు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాచేస్తున్న లారీని సీజ్ చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్సు ఎస్ఐ ప్రసాద్ బృందం మంగళవారం కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుకర్యాంపులో తనిఖీలు చేపట్టారు. ఎటువంటి బిల్లు లేకుండా 12 మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా చేస్తున్న లారీని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కేసునమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మైన్స్ అధికారులకు తెలియజేస్తున్నట్టు తెలిపారు.



బల్లిపాడు ర్యాంపులో మైన్స్ అధికారులు.. స్వాధీనం చేసుకున్న మిషన్,డ్రెడ్జింగ్ బోటు

డయేరియా ఎందుకొచ్చింది?

ఇంకనూ అంతుబట్టని వైనం

గోపాలపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గోపాలపురం మండలాన్ని డయేరియా భయ పెడుతోంది.. అయినా ఎందుకు వచ్చిందనేది నేటికీ అంతుచిక్కలేదు. గత నాలుగు రోజులుగా మండలంలో సుమారు 30 మంది డయేరియా బారినపడ్డారు. ఒక పక్క సీఎం చంద్రబాబు నాయుడు గోపాల పురం మండ లంలో పరిస్థితిపై ఆరాతీశారు. ఇదిలా ఉండగా సోమవారం పి.ప్రశాంతి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వైద్య శిబిరాలను సందర్శించి సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఇంకో వైపు 10 వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో ఇంటింటా సర్వేలు చేస్తూ డయేరియా బాధితుల నుంచి మలము, తాగునీరు నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపిస్తున్నారు.ఉచిత క్యాంపుల ద్వారా 16వ తేదీన 13 నీటి నమూనాలు, ఒక మలము సేకరించి డీపీహెచ్ఎల్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు.సోమవారం రెం డు చోట్ల నీటి నమూనాలతో పాటు ము గ్గురు డయేరియా బా ధితుల నుంచి మలం సేకరించి కాకినాడ ల్యాబ్‌కు పంపించారు. మరో చోట నాలుగు నీటి నమూనాలను సేకరించి వైజాగ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించినట్టు ఇక్కడి అధికారులుచెబుతున్నారు. నమూనాలను ల్యాబ్‌లకు పంపించి రెండు రోజులు పూర్తవుతున్నా నేటికీ ఫలితం అంద లేదు. ఇదిలా ఉంటే ఈ వ్యాధి నిర్ధారణ కోసం వివిధ రకాల నమూనాలను జిల్లా యంత్రాంగం సేకరించింది.



రోగులకు ఏర్పాటు చేసిన జంబో జెట్ కూలర్లు

గోపాలపురం ఆసుపత్రిలో ఏడుగురు బాధితులు

గోపాలపురంలో డయేరియా కేసులు తగ్గుముఖం పట్టాయి. సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితుల సంఖ్య 9కి చేరింది. మంగళవారం ఉదయం వారిలో ఆరుగురు ఇంటికి వెళ్లారు. మరో నాలుగు కేసులు నమోదయ్యాయి.దీంతో మంగళవారం డయేరియా బాధితుల సంఖ్య ఏడుకు చేరింది. ఎమ్మెల్యే మద్దిపాటి వెం కట్రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్నారు. సోమవారం ఎమ్మెల్యే మద్దిపాటి ఆసుపత్రికి వచ్చే సమయానికి డయేరియా బాధితులు ఉన్న వార్డులో ఉక్కబోత ఉండడంతో ఎమ్మెల్యే ప్రతి వార్డులోనూ జంబో కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆసుపత్రి వార్డుల్లో జంబో కూలర్లు ఏర్పాటు చేశారు.

సత్యసాయి నీటి సరఫరాలో నిర్లక్ష్యం?

మండలంలో గత నాలుగు రోజులుగా డయేరియా వ్యాప్తితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీల ద్వారా సరఫరా చేసిన రక్షిత మంచినీటిని ఈ ప్రాంత ప్రజలు కేవలం గృహావసరాలకు వినియోగిస్తుంటారు.శ్రీ సత్యసాయి మంచినీటి సరఫరా పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీటినే తాగుతారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసింది.కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు గడిచినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ పథకం నిర్వహణపై దృష్టిసారించలేదు. సత్యసాయి జలాల సరఫరాలో నాణ్యతా లోపం వల్లనే డయేరియా ప్రబలందని ప్రజలంటున్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

• వ్యవసాయ శాస్త్రవేత్తలు • ధర్మవరంలో వరి కమతాల సందర్శన



ధర్మవరంలో వరి పంటను పరిశీలిస్తున్న మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు

కొవ్వూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం ధర్మవరంలోని వ్యవసాయ క్షేత్రాలను మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం, రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. ప్రస్తుత దాళ్వా పరిస్థితి, చీడపీడల ఉధృతి వంటి వాటిపై అధ్యయనం చేశారు. దిగుసంచలు ప్రదర్శనలో భాగంగా సాగు చేస్తున్న ఎంటీయూ 1426, ఎన్ఎల్ఆర్ 3238 రకాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గిరిజారాణి, ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ వి. భువనేశ్వరి, కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు పి. చంద్రశేఖర్, డీఆర్సీ ఏడీఏ ఎస్. జయరామలక్ష్మి, వ్యవసాయాధికారి ఏ. గంగాధర్, వీఏఏ జ్యానదాస్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు జే. కార్తీకకుమార్, జీ. లోకేష్, వి. నితిన్, జీ. పవన్‌కుమార్ రెడ్డి, ఎస్. నవీన్, అభ్యుదయ రైతులు పిన్నెటి రమేష్, వి. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కోకో సాగు విస్తీర్ణం పెరగాలి

• జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుజాత



ఆవపాడులో కోకో గింజలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన వన శాఖాధికారి సుజాత

నల్లజర్ల,మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలో కోకో సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుజాత అన్నారు. మంగళవారం శింగరాజుపాలెం, ఆవపాడు, ప్రకాశరావుపాలెంలోని కోకో పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు తగు సూచనలిచ్చారు. మార్కెట్‌లో క్వింటా కోకో రూ. 60 వేలు ఉందని చెప్పారు. అలాగే కొబ్బరి, ఆయిల్‌పాం తోటల్లో కూడా అంతర పంటగా కోకోను పండించాలన్నారు. ఈమెతోపాటు నల్లజర్ల ఉద్యానవన శాఖ అధికారి బబిత, అమర్‌నాథ్, బాల, పూర్ణిమ, మనోజ్, తదితరులు ఉన్నారు.

మట్టి రవాణా విషయంపై టీడీపీలో వర్గపోరు



గజ్జరంలోని ముత్యాలమ్మ ఆలయం

తాళ్లపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి రవాణా విషయంలో టీడీపీలోని రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది. తమ అనుమతి లేకుండా రవాణా చేయడానికి వీల్లేదని ఒక వర్గం అడ్డుకోవడాన్ని గజ్జరం గ్రామానికి చెందిన టీడీపీ నేత కార్య వంశీ ఆక్షేపించారు. ఈ గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద గోతులు పూడ్చటానికి లారీలో మట్టి తోలుతుండగా కొంత మంది నాయకులు తనకు అడ్డుకుని కలిగించి లారీని ఆపేశారని వంశీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మండలంలో రెండు వర్గాల మధ్య వివాదం బయటపడింది. అధికారుల కంటే నాయకులకే అనుమతులు లేని లారీలను నిలిపివేస్తు న్నారని, అనుమతుల కోసం ఒక్కొక్క లారీకి కొంత రుసుము చెల్లించాలన్నది ఇక్కడి నిర్ణయంగా మారిందన్నారు. ఈ నిర్ణయంతో ఒక వర్గం వారి లారీలకే అనుమతులు లభిస్తుండడంపై మరొక వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

జారితే.. అంతే..!

• ప్రమాదభరితంగా ఆర్ అండ్ బి రోడ్లు



ప్రక్కిలంక పిటింగట్టు మాదిరి వద్ద ఇలా..



ప్రక్కిలంక జగ్జీవన్ రామ్ కూడలిలో..

తాళ్లపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల ఆర్ అండ్ బీ రోడ్డు ప్రమాదభరితంగా మారాయి. లారీలు, ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నప్పుడు రోడ్డుపై కొంత ఇసుక పడిపోతుండడంతో అటుగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి ప్రమాదం ఏర్పడుతోంది. నిబంధనల మేరకు ఇసుక లోడుతో వెళ్లే వాహనాలకు టార్పాలిన్ కప్పాల్సి ఉన్నా .. అలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రక్కిలంక ఏటిగట్టు కూడలి వద్ద పేరుకుపోయిన ఇసుకతో గట్టు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు మరింత ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఇకనైనా అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేయాలి

నల్లజర్ల, మార్చి18 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి విశ్రాంత ఉద్యోగులకు డీఆర్, పీఆర్సీ బకాయిని వెంటనే విడుదలచేయాలని మండల విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ నాయుడుకి వినతిపత్రమిచ్చారు. ఎస్ఎం అలీ సాహెబ్, బాలయ్య ప్రభుదాసు,వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



డీలర్లతో మాట్లాడుతున్న సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ రాజు

నల్లజర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకుంటేనే ... ప్రభుత్వం త్వరలో అందించే స్మార్ట్‌కార్డులు పొందేందుకు అర్హత ఉంటుందని సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ రాజు అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు ఈకేవైసీ ఎలా చేయించాలన్నదానిపై అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 7,720 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దూపింపాల వెంకన్న, దీమునిరెడ్డి చంద్రం, బి. లక్ష్మణరావు, అచ్యుత బాస్కరరావు, తానిగడప మహేష్, నాగు పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల సమావేశం

ఉండ్రాజవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సివిల్ సప్లై డీటీ ఎస్ఎస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని 15 గ్రామాల్లో 44 రేషన్ డీలర్ షాపులు ఉన్నాయని, అందరూ ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు. మండలంలో మొత్తం 6,412 మంది రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ చేసే విధానం గురించి వివరిస్తామని చెప్పారు. జిల్లా నుంచి అధికారి వచ్చి వివరాలను తెలియజేస్తారన్నారు. సమావేశానికి హాజరుకానివారిపై తగు చర్యలు తీసుకుంటామని డీటీ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తాళ్లపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెద్దేవం గ్రామశివారు రావూరుపాడు బస్‌షెల్టర్ వద్ద మంగళవారం గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వ్యక్తి వయసు సుమారు 40 నుంచి 45 మధ్య ఉంటుంది. గత నాలుగు రోజులుగా ఇక్కడే ఉంటూ చుట్టుపక్కల వారు పెట్టింది తినేవాడని స్థానికులు చెబుతున్నారు. వివరాలు తెలిస్తే తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌కి సమాచారం అందించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



దేవరపల్లిలో పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

దేవరపల్లి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని రాష్ట్రప్రభుత్వం అమరావతిలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించడంపై మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన విలేకర్ల సమావేశంలో పొట్టిశ్రీరాములు పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామకృష్ణ కాశీకృష్ణ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు విగ్రహంతో పాటు స్మృతివనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, అలాగే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తీగల బలరామయ్య, కొత్తగుండి బాబురావు, సుతాపల్లి ప్రభాకరరావు, వెలగా శ్రీనివాస్, సుతాపల్లి నాగరాజు, రామా రావు, చలంచర్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా కేసులు గణనీయంగా తగ్గుముఖం

• డీఎల్‌పీవో అమ్మాజీ



గోపాలపురంలో సూపర్‌శానిటేషన్ చేయిస్తున్న డీఎల్‌పీవో అమ్మాజీ

గోపాలపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో డయేరియా కేసులు గణనీయంగా తగ్గుతున్నాయని డీఎల్‌పీవో వై.అమ్మాజీ అన్నారు. డయేరియా నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ పీ.ప్రశాంతి ఆదేశాల మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు గోపాలపురంలోనే మకాం వేసి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించారు. పరిసర ప్రాంతాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి సూపర్‌శానిటేషన్ చేయించారు. ఈసందర్భంగా అమ్మాజీ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగంగా పారిశుధ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం ద్వారా అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాలతో పెద్దగూడెం, ఉప్పర గూడెం, వేలిదిండలగూడెం, పెద్దాపురం, వెంకటాయపాలెం, తదితర గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి అనురాధ, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



కానూరులో యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

పెరవలి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని కానూరు సర్పంచ్ బావన మధు పేర్కొన్నారు. కానూరు జెడ్పీ హైస్కూల్లో మంగళవారం బెస్ట్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 64 మందికి దాతల సహాయంతో యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ రామాంజనేయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ నరమామిడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీటీసీ -1 కోలా లక్ష్మి సత్యనాయుడు, ఎంపీటీసీ- 2 మతల ఊహారాణి, బూరుగుపల్లి రాజు, దాత అనపర్తి సత్యనారాయణ , లాయర్ సుధాకర్, టీచర్లు పాల్గొన్నారు.

జూనియర్ బేసిక్ స్కూల్ విలీనం వద్దు



చాగల్లులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చాగల్లు, మార్చి 18, (ఆంధ్రజ్యోతి) : స్థానిక జూనియర్ బేసిక్ స్కూల్‌ను ఫౌండేషన్ స్కూల్‌గా ప్రకటించి ఇక్కడ ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను నెంబరు ప్రాథమిక పాఠశాలకు బదలాయించడంపై సీపీఎం నాయకులు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం జూనియర్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా జరిగిన ప్రజా చైతన్యయాత్రలో భాగంగా జూనియర్ బేసిక్ స్కూల్ విద్యార్థులను నెంబరు స్కూల్‌కు బదలాయించడం సరికాదన్నారు. తక్షణమే దీన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఎం నాయకులు గారపాటి సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, కేకే దుర్గారావు, ఎస్‌కే ఆదాం పాల్గొన్నారు.

చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

తాళ్లపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మలకపల్లికి చెందిన దిబ్బా రాజేంద్రప్రసాద్‌ని చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోలిమేర హరికృష్ణ మంగళవారం నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చర్మకారుల కుటుంబాలకు న్యాయం చేస్తానన్నారు.

ముక్కామలలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



నేత్ర వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెరవలి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముక్కామలలో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి నిడదవోలు వారు హెల్పేజ్ ఇండియా వారి సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవల గురించి కొనియాడారు. వైద్యశిబిరంలో 62 మంది సేవలుపొందగా, అందులో 12 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో బోళ్ల మంగారావు, సలాది ఉదయ భాస్కరరావు, క్లబ్ ప్రెసిడెంట్ కోలా సత్యనారాయణ నాయుడు, సెక్రటరీ బి. రాజు, ఆరిగెల ఆదిత్య కుమారి, ఏడిద వీర వెంకట సత్యనారాయణ, సలాది భాస్కరరావు, బృందావనం కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా 28 యూనిట్లు మంజూరు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ

దేవరపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న స్వయం ఉపాధి సోపానం కింద మండలానికి బీసీ కార్పొరేషన్ ద్వారా 28 యూనిట్లు మంజూరయ్యాయని మండల ప్రత్యేకాధికారి ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపు కార్పొరేషన్‌కు 38 యూనిట్లు, ఓసీలకు 7 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 62 సంవత్సరాల వయసు గలవారు అర్హులన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ. రెండులక్షల నుంచి రూ. ఐదులక్షల వరకు రుణం మంజూరవుతుందని తెలిపారు. ఇందులో 50 శాతం వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. అలాగే మహిళలకు ప్రత్యేకంగా కుట్టుమిషన్లలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒనువులమ్మ ఆలయ వార్షికోత్సవం



ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రేడులో ఒనువులమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉత్సవ మూర్తికి భక్తులు క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో మహిళలు కలశాలతో గ్రామ పురవీధుల్లో ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమ పూజ, సహస్రనామ పుష్పార్చన చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాడు పార్టీ మారితే.. నేడు తీసుకోవద్దు!

మాజీ కార్పొరేటర్ వెలుగుకుమారి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు వైసీపీలోకి పోయి పార్టీకి తీరని ద్రోహం చేసిన వారు ఇప్పుడు మళ్లీ పార్టీ వైపు చూస్తున్నారని అటువంటి వారిని పార్టీలోకి రానివ్వద్దని మాజీ కార్పొరేటర్, టీడీపీ అంగన్వాడీ రాష్ట్ర అధికార ప్రతినిధి కడలి వెలుగుకుమారి కోరారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు మొదలుకొని ఎమ్మెల్యేల వరకు అందరూ ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. వైసీపీకి చెందిన పాలిక శ్రీను టీడీపీలోకి వచ్చేందుకు మార్గాలు వెతుకుతున్నట్టు తెలిసిందన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించకూడదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణ, నగర బోయిన రామకృష్ణ, దంగేటి అన్నవరం, పొలవరపు రాము తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



చాగల్లులో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

చాగల్లు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. దీన్ని కొవ్వూరు డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ ఎస్. సత్యనారాయణ, ఉప సంచాలకుడు డాక్టర్ వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చాగల్లులో జరిగిన కార్యక్రమాన్ని పరిశీలించి వారిద్దరు మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన ప్రతి పాడి పశువుకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించుకోవాలన్నారు. మొత్తం 142 పశువులకు వ్యాక్సిన్లు వేసినట్టు చెప్పారు. వైస్ ఎంపీపీ జబ్బవరపు రామచంద్రరావు, పశువైద్యాధికారి యం. ముఖేష్, పశుసంవర్ధక సహాయకులు నాగేంద్రబాబు, లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మీసేవ నిర్వాహకుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తిన రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని మీసేవ నిర్వాహకుల సంఘం జిల్లా నాయకులు ఎస్‌కే హమీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు ఈవిధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి ప్రజలకు సేవలను దగ్గర చేస్తే.. ఆ తర్వాత వచ్చిన జగన్ రెడ్డి ఈ కేంద్రాల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చేశారన్నారు.

దొండిపూడిలో పూడికతీత పనులు



గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

గోపాలపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డయేరియా ప్రభావంతో గ్రామాల్లో నిర్వహిస్తున్న సూపర్ శానిటేషన్ పనుల్లో యువత భాగస్వాములు కావాలంటూ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఇచ్చిన పిలుపుకు దొండపూడికి చెందిన అరుంధతి యువజన సేవా సంఘ సభ్యులు స్పందించారు. యువజనులంతా ఏకతాటిపై వచ్చి డ్రైనేజీల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ నెలలో ఒకరోజున పారిశుధ్య పనులు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్న సీఎం నారా చంద్రబాబు నాయుడు పిలుపుకు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో అరుంధతి యువజన సేవా సంఘం సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర అటవీ అకాడమీ సొంత భవన నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

దివాన్‌చెరువు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీకి సొంత భవనం నిర్మాణానికి మార్గం సుగమమైంది. డిప్యూటీ సీఎం పవన్ చొరవతో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ రాష్ట్ర అటవీశాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఈమేరకు తాజాగా ఆదేశాలిచ్చారు. ఇక్కడ నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గత ఆగస్టులో పవన్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే దీన్ని కొనసాగించడంతో పాటు అక్కడే సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. దాంతో పవన్ ఈ విషయాన్ని కేంద్ర అటవీశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఎట్టకేలకు స్పందించిన కేంద్రం చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రాష్ట్ర అటవీ అకాడమీని దాదాపు ఎనిమిదేళ్లుగా రాష్ట్ర అటవీ పరిశోధనా భవనంలోనే నిర్వహిస్తున్నారు.

న్యాయవాదుల వినతి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో సుజాతకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

రాజమహేంద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ రెవెన్యూ కోర్టుల్లో ప్రాక్టీస్ చేసే న్యాయవాదులు,గవర్నమెంట్ ఏజెంట్ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలనే నిర్ణయం సరైంది కాదని, తక్షణం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్భాకోట వెంకటేశ్వరరావు అన్నారు. అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ స్పందించాలని కోరారు. గొట్టుముక్కల అనంత రావు, బీర అరుణ్‌కుమార్, ముప్పిడి సుధీర్‌కుమార్, ఎం.చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.